# ప్రతిస్పందన

1987 నుంచి ప్రచురితమవుతున్న
**జర్నలిస్టుల మాసపత్రిక**

సంపుటి: 13 సంచిక: 8
పేజీలు: 28 వెల: రూ. 5.00

**ఆగస్టు, 2010**

## విషయ సూచిక

| | |
|---|---|
| దినభూమి ఎడిటర్ అరెస్టు, విడుదల | 4 |
| పెయిడ్‌న్యూస్ నిరోధానికి చట్టాన్ని సవరించాలి | 5 |
| ఆగస్టు 29న ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే ఎన్నికలు | 5 |
| ప్రొఫెషనల్ కమిటీలను వెంటనే నియమించాలి | 6 |
| ప్రధాన సమాచార కమిషనర్‌గా జన్నత్ ప్రమాణం | 7 |
| వార్తలు వ్యాఖ్యలు కలగాపులగం | 8 |
| రాజేంద్రప్రసాద్ అనుభవాలు, జ్ఞాపకాలు | 9 |
| జర్నలిస్టులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు | 11 |
| స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించండి | 12 |
| మద్యనియంత్రణ ఉద్యమానికి జర్నలిస్టుల పూర్తి మద్దతు | 16 |
| గంజాయి తరలింపు కేసులో మూడు చానెళ్ల విలెకరులు | 17 |
| స్వతంత్ర మీడియా ట్రిబ్యునల్ | 19 |
| ఐఏఎస్ టాపర్‌కు హెచ్‌యూజే అభినందన | 20 |
| జిలాల్లల వార్తలు | 21-23 |
| **'PAID NEWS' INTERFERES WITH CONCEPT OF FREE, FAIR AND OBJECTIVE PRESS: PRATIBHA PATIL** | 26 |

### *సంపాదకీయ వ్యాఖ్య*

# ఎడిటర్‌పై దోపిడీ కేసా?

తమిళ దినపత్రిక 'దినభూమి' ఎడిటర్ ఎస్. మణిమారన్‌నూ, మరో ఇద్దరినీ తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన వైనం జర్నలిస్టులనే కాకుండా సామాన్య జనాన్ని కూడా నివ్వెర పరిచింది. మధురై గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం ఫిర్యాదు మేరకు పోలీసులు అర్ధరాత్రి వెళ్లి మణిమారన్‌ను అరెస్ట్ చేశారు. బలవంతంగా డబ్బులు గుంజేందుకు ప్రయత్నించడం, నేరపూరిత బెదిరింపులకు పాల్పడడం, చావు భయాన్ని కలిగించడం, దోపిడీ, బహిరంగంగా అశ్లీలమైన పనులకు పాల్పడడం వంటి అభి యోగాలకు సంబంధించిన సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేశారు. తమిళనాడు పోలీసుల ఈ తెంపరితనాన్ని ఆ రాష్ట్రంలోని జర్నలిస్టు సంఘాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. అధికారంలో ఉన్న పార్టీ తప్ప అన్ని రాజకీయ పక్షాలూ ఈ అరెస్టులను పత్రికా స్వేచ్ఛపై దాడిగానే అభివర్ణించాయి. అరెస్టులకు వ్యతిరేకంగా వచ్చిన తీవ్రమైన స్పందన చూసి పోలీసు యంత్రాంగం కాస్త సర్దుకుంది. దోపిడీ, నేరపూరిత బెదిరింపులు, బలవంతంగా డబ్బులు గుంజడం వంటి తీవ్రమైన అభియోగాలను ఉపసం హరించుకున్నారు. ముఖ్యమంత్రి కరుణానిధి సూచన మేరకు బెయిల్ దరఖాస్తును పోలీసులు వ్యతిరేకించకపోవడంతో దినభూమి ఎడిటర్‌తో సహా ముగ్గురూ బెయిల్‌పై విడుదలయ్యారు. మధురై చుట్టుపక్కల గ్రానైట్ క్వారీలపై దినభూమిలో తప్పుడు రాతలు అనేకం రాశారనీ, రాయకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేశారనీ క్వారీ యజమానుల సంఘం ఆరోపించింది. దినభూమి డిమాండ్ మేరకు 5 లక్షల రూపాయలు చెల్లించామనీ, అయినా వదలకుండా క్వారీలపై తప్పుడు ప్రచారంతో పోస్టర్లు కూడా అంటించారని ఫిర్యాదులో ఆరోపించారు. మధురైలోని గ్రానైట్ క్వారీ యజమానుల అక్రమాలను దినభూమి బయటపెట్టినందువల్లనే వారు కక్షగట్టి తప్పుడు కేసు బనాయించారని జర్నలిస్టు వర్గాలు చెబుతున్నాయి. రాజకీయ వర్గాలతో కాంట్రాక్టర్లు కుమ్మక్కయి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం ఎంత సర్వసాధారణమైన విషయంగా మారిందో అందరికీ తెలుసు. ఈ తరహా అక్రమాలనూ, అవినీతి బాగోతాలనూ బయటపెట్టేందుకు ప్రయత్నించే మీడియాపై, జర్నలిస్టులపై ధనస్వామ్యం ఎంతలా కన్నెర్ర చేస్తున్నదీ కూడా ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా ప్రజల పక్షాన నిలవడమే కర్తవ్యంగా భావించే జర్నలిస్టులు అదరక బెదరక అక్రమాల వెలికితీతపై దృష్టి సారిస్తుండడంతో వారిపై దాడులు, అక్రమ కేసులు బనాయించి వేధించడం ఇటీవల ఎక్కువయ్యాయి. దినభూమి ఎడిటర్ తప్పు చేసి ఉంటే దానిని నిరూపించి శిక్షించే పద్ధతి ఇదికాదు. క్వారీల యజమానులు తమ ఫిర్యాదులో ఎన్నైనా ఆరోపణలు చేయవచ్చుగాక; సక్రమమైన దర్యాప్తు జరిపి ఆ ఆరోపణల్లో పస ఉన్నదీ లేనిదీ నిర్ధారించుకోవాల్సిన అవసరం పోలీసులకు లేదా? ఒక దిన పత్రిక ఎడిటర్‌పై దోపిడీలకు, నేరపూరిత బెదిరింపులకూ పాల్పడడం వంటి అభియోగాలు మోపడాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి? దీన్ని తెంపరితనం గాక ఏమనాలి? తక్షణం నిర్బంధించకపోతే సమాజానికి ఎంత హాని కలుగుతుందో అన్న రీతిలో జర్నలిస్టులను అర్ధరాత్రి నిద్రలేపి అరెస్టు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఏవిధంగా చూసినా తమిళనాడు పోలీసుల నిర్వాకం తీవ్రంగా ఖండించదగిన వ్యవహారమే. జర్నలిస్టులతోపాటు ప్రజాస్వామ్యవాదులందరూ ఈ ధోరణులను ఎదుర్కొనేందుకు సర్వశక్తులూ కూడ దీసుకోవాలి.

**సంపాదకులు :** కె.శ్రీనివాస్ రెడ్డి, **సంపాదకవర్గం:** డి.సోమసుందర్, వై.నరేందర్ రెడ్డి, అయిలు రమేష్, ఎం.కృపావరం, ఐ.వి.సుబ్బారావు, అంబటి ఆంజనేయులు, ఎ.నగేష్ బాబు, నల్లి ధర్మారావు, కె.విరాహత్ అలీ, మహ్మద్ రియాజ్ అహ్మద్, కె.మహిపాల్ రెడ్డి

Editor, Printer and Publisher **K. Sreenivas Reddy,** Printed at Joy 'N' Joy Printers, Chapel Road, Hyderabad.
Owned by A.P. Union of Working Journalists, Fateh Maidan, Hyderabad - 500 001. Telefax : 23232660. email: apuwj@yahoo.com, website : www.apuwj.org



దినభూమి ఎడిటర్ మణిమారన్ (టోపీ పెట్టుకున్న వ్యక్తి), మరో ఇద్దరిని మధురైలో రిమాండ్‌లోకి తీసుకున్న దృశ్యం

## గ్రానైట్ గనుల స్కామ్ బయటపెట్టినందుకు

# దినభూమి ఎడిటర్ అరెస్టు: బెయిల్‌పై విడుదల

మధురై ప్రాంతంలో వున్న గ్రానైట్ గనుల వ్యవహారంపై వార్త ప్రచురించినందుకు జూలై 4న అరెస్టుచేసిన తమిళ దినపత్రిక 'దినభూమి' ఎడిటర్ మణిమారన్, ఆయన కుమారుడు ఎం. రమేష్‌కుమార్, సహచరుడు ఎం. ముత్తయ్యలను 22వ తేదీన విడుదలచేశారు. మధురై కోర్టు జుడిషియల్ మెజిస్ట్రేటు ముందుకు వచ్చిన బెయిలు దరఖాస్తును ప్రాసిక్యూషన్ వ్యతిరేకించనందు వల్ల వారిని విడుదలచేశారు. ప్రభుత్వ సీనియర్ అధికారి కథనం ప్రకారం ముఖ్యమంత్రి సలహా మేరకు బెయిల్ దరఖాస్తును ప్రాసిక్యూషన్ వ్యతిరేకించలేదు. ఐపీసీ కింద ముగ్గురిమీద నమోదుచేసిన కేసులోని అనేక సెక్షన్లను డిపార్టుమెంటు తొలగించిందని ఒక పోలీసు అధికారి చెప్పారు. బెయిల్‌కు అవకాశంలేని అనేక సెక్షన్లను పోలీసులు తొలగించిన కారణంగా తాను కోర్టులో బెయిల్‌కోసం దరఖాస్తుచేశానని మణిమారన్, మరో యిద్దరి పక్షాన కేసు వాదిస్తున్న లాయరు పి. రాజేంద్రన్ పేర్కొన్నారు. దరిమిలా జుడిషియల్ మెజిస్ట్రేటు ఉమామహేశ్వరి బెయిలు మంజూరు చేశారని రాజేంద్రన్ చెప్పారు. మధురైకి సమీపంలోని మెలూర్ తదితర ప్రాంతాలలో గనుల ఆపరేటర్ల వల్ల రాష్ట్ర ఖజానాకు సంభవిస్తున్న భారీ నష్టాల గురించి మాత్రమే 'దినభూమి' పత్రికలో ఎండగట్టామని బెయిల్‌మీద విడుదలైన ఎడిటర్ మణిమారన్ విలేకరులతో చెప్పారు. వార్త ప్రచురిం చకపోతే పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెప్పాలని తాము డిమాండు చేసినట్టు, బెదిరించినట్టు ఫిర్యాదుదారు చేసిన ఆరోపణ వాస్తవ దూరమైనదని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి జోక్యం వల్లనే బెయిల్ లభించిందా అని విలేకరులు వేసిన ప్రశ్నకు సమాధానంగా ఆయన సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు. గనుల ఆపరేటర్లు తమమీద చేసిన ఆరోపణలను చట్ట పరిధిలోనే ఎదుర్కొంటామన్నారు. ఆపరేటర్ల కొమ్ముకాస్తున్న అధికారుల మీద చర్య తీసుకోవాలని ఆయన డిమాండుచేశారు. ఒక దినపత్రిక ఎడిటర్ మీద దోపిడీ, బలవంతపు వసూళ్లకు సంబంధించిన కేసులు పెట్టడం తమను దిగ్భ్రాంతిపరచిందని ఆయన వ్యాఖ్యానించారు. •

# పెయిడ్‌న్యూస్ నిరోధానికి చట్టాన్ని సవరించాలి

ప్రభుత్వానికి ప్రెస్‌కౌన్సిల్ సిఫారసు

పెయిడ్ న్యూస్ నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రెస్ కౌన్సిల్ ప్రత్యేక కమిటీ ప్రభుత్వానికి అనేక సిఫార్సులు చేసింది. ఐఎన్ఎస్ మాజీ అధ్యక్షుడు హెచ్.ఎన్. కామా అధ్వర్యంలో రూపొందించిన ముసాయిదా నివేదికను సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జి.ఎన్.రే అధ్యక్షతన జూలై 30న సమావేశమైన ప్రెస్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదించిన నివేదికలో చేసిన సిఫార్సులు ఇలా ఉన్నాయి.** వార్తల ప్రచురణకు చేసే చెల్లిం పులన్నీ అవినీతి కిందికే వస్తాయని ప్రకటించేలా ఎన్నికల చట్టా లకు సవరణ తీసుకురావాలి. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951ని తదనుగుణంగా సవరించాలి. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్ ఫిర్యాదుల స్వీకరణకు భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుల ప్రాతిపదికన త్వరగా చర్యలు తీసుకోవాలి. వివిధ రాష్ట్రాలకు ప్రెస్ కౌన్సిల్‌ను సంప్రదించి ఇండిపెండెంట్ జర్నలిస్టులు కానీ, పౌరులను కానీ ఈసీ నామినేట్ చేయాలి. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్టాన్ని సవరించాలి. కౌన్సిల్ ఆదేశాలకు పత్రికలు కట్టుబడి ఉండేలా చూడాలి. ఎలక్ట్రానిక్ మీడియాను కూడా కౌన్సిల్ పరిధిలోకి తీసు కురావాలి. కౌన్సిల్‌లో ఎలక్ట్రానిక్, ఇతర మీడియా ప్రతినిధులను కూడా చేర్చడానికి వీలుగా ప్రెస్ కౌన్సిల్‌ను పునర్ వ్యవస్థీకరించాలి. •

## ఆగస్టు 29న ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే ఎన్నికలు

ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ జనరల్ పదవులకు, నేషనల్ కౌన్సిల్‌కు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్ష పదవికి, స్టేట్ కౌన్సిల్‌కు ఆగస్టులో ఎన్నికలు జరుగుతాయి. ఏపీయూడబ్ల్యూజేలో సభ్యులైన 10,923 మంది అర్హులైన ఓటర్లు ఈ ఎన్నికలలో తమ నాయ కులను ఎన్నుకుంటారు. సీనియర్ జర్నలిస్టు బి.ఎస్.రామకృష్ణ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహ రిస్తారు. వివిధ జిల్లాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు.

**ఎన్నికల షెడ్యూలు**

| | |
|---|---|
| • నామినేషన్లు దాఖలుచేసే చివరి తేదీ | 6-8-2010 (శుక్రవారం) |
| • నామినేషన్ల పరిశీలన | 7-8-2010 (శనివారం) |
| • పరిశీలన తర్వాత అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రచురణ | 8-8-2010 (ఆదివారం) |
| • ఉపసంహరణలు | 11-8-2010 (బుధవారం) |
| • పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ | 11-8-2010 (బుధవారం) |
| • పోస్టల్ బ్యాలెట్లు మరియు బ్యాలెట్ బండిళ్లను జిల్లాలలోని పోలింగ్ కేంద్రాలకు కొరియర్ సర్వీస్ ద్వారా రవాణా | 23-8-2010 (సోమవారం) |
| • రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాలలో పోలింగ్ | 29-8-2010 (ఆదివారం) |
| • పోలింగ్ కేంద్రాలనుంచి పోస్టల్ బ్యాలెట్లు, బ్యాలెట్ బండిళ్లు స్వీకరించే చివరి తేదీ | 3-9-2010 (శుక్రవారం) |
| • ఓట్లు లెక్కింపు (హైదరాబాద్‌లో వోట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన) | 4-9-2010 (శనివారం) |

# ప్రొఫెషనల్ కమిటీలను వెంటనే నియమించాలి

## ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గం డిమాండ్

మీడియాకు సంబంధించిన వృత్తికమిటీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) కార్యవర్గ సమావేశం ఖండించింది. గడువు ముగిసిన కమిటీలను వెంటనే నియమించాలని డిమాండు చేసింది. యూనియన్ అధ్యక్షుడు డి. సోమసుందర్ అధ్యక్షతన జూలై 16న హైదరాబాదులో జరిగిన కార్యవర్గ సమావేశంలో యూనియన్ కార్యక్రమాలను సమీక్షించారు. గత ఫిబ్రవరిలో జరిగిన కార్యవర్గ సమావేశం అనంతరం యూనియన్ చేపట్టిన కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి వై. నరేందర్‌రెడ్డి తన నివేదికలో వివరించారు. ఐజేయూ సెక్రటరీ జనరల్ కె. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అమర్‌నాథ్, కార్యవర్గ సభ్యులు అంబటి ఆంజనేయులు, ఎం.ఏ. మాజిద్, డి. కృష్ణారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే పూర్వాధ్యక్షుడు దేవులపల్లి అమర్, మాజీ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు.

గడువు ముగిసిన రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ కమిటీ, దాడుల నిరోధక ఉన్నతస్థాయి కమిటీ, రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కమిటీ, ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్‌ను వెంటనే నియమించాలని కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించకపోతే ఆందోళన చేపట్టాలని యూనియన్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు.

ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష పదవికి, స్టేట్ కౌన్సిల్‌కు ఆగస్టులో జరిగే ఎన్నికల ఏర్పాట్ల గురించి కార్యవర్గం చర్చించింది. దీనికి సంబంధించిన నియమ నిబంధనలను ఖరారుచేసింది.

ఆరోగ్యశ్రీ కార్డులు అందని జర్నలిస్టులకు వెంటనే వాటి జారీకి చర్యలు చేపట్టాలని కూడా కార్యవర్గ సమావేశంలో ఆమోదించిన మరో తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ రైల్వే కన్సెషన్ పాసులు జారీచేయించడానికి సమాచార శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టులపై యిటీవల జరిగిన దాడులను ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం ఖండించింది. శ్రీకాకుళం జిల్లా సోంపేటలో నిర్మించతలపెట్టిన థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం సందర్భంగా ఆందోళనకారులపై జరిపిన కాల్పులు, లాఠీచార్జీ సంఘటనలలో ఏడుగురు జర్నలిస్టులు గాయపడటం పట్ల కార్యవర్గ సమావేశం ఆందోళన వెలిబుచ్చింది.

ఏపీయూడబ్ల్యూజే మాజీ ప్రధాన కార్యదర్శి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మాజీ రెసిడెంట్ ఎడిటర్ పీఎస్ సుందరం మృతిపట్ల యూనియన్ కార్యవర్గ సమావేశం ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసింది. యూనియన్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకుంది. ఆంధ్రప్రభలో చీఫ్ ప్రూఫ్‌రీడర్‌గా పనిచేసిన రామశేషయ్య (హైదరాబాద్), విలేకరులు జి. భాస్కరరెడ్డి (వరంగల్ జిల్లా), రమణయ్య (వాకాడు, నెల్లూరు జిల్లా), ఉర్దూ దినపత్రిక 'అంగారే' ఎడిటరు మొయిన్ ఫారూఖీ, సోమసుందరాచారి (జూపాడు బంగ్లా, కర్నూలు జిల్లా), సత్యనారాయణ (పాలకుర్తి, వరంగల్ జిల్లా), చాపరాల మురళీకృష్ణ (కృష్ణాజిల్లా), ఉత్తరాఖండ్ రాష్ట్ర ఫ్రీలాన్స్ జర్నలిస్టు హేమచంద్రపాండే మృతికి యూనియన్ సంతాపం ప్రకటించింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. •

# ఢిల్లీలో తెలుగు జర్నలిస్టుపై దాడి

ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావుపై జూలై 29వ తేదీ రాత్రి పదిన్నర గంటలకు న్యూఢిల్లీలో గుర్తు తెలియని దుండగులు దాడిచేశారు. దాడి నుంచి ఆయన క్షేమంగా బయట పడ్డారు. పార్లమెంటు సమావేశం ముగిసిన తర్వాత కృష్ణారావు కారులో యిం టికి వెళ్తుండగా రద్దీగా ఉండే మయూరీ విహార్ వద్ద ఐదుగురు దుండగులు ఆయన కారును అటకాయించి దోపి డీకి ప్రయత్నించారు. దాంతో ఆయన కారును వేగంగా నడిపారు. దుండగులు కారు అద్దాల లోపలి నుంచి కాల్పులు జరిపారు. వారు పేల్చిన బుల్లెట్లు పక్కకు దూసుకుపోవడంతో ఆయన బతికి బయటపడ్డారు. కారు అద్దం తునాతునకలైంది. కృష్ణారావు జూలై 30న పోలీసులను ఆశ్రయిస్తే కేసు నమోదు చేయకుండా కుంటి సాకులు చూపి తప్పించుకున్నారు. ఆయన ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రికి, ఢిల్లీ పోలీసు కమీషనర్‌కు తెలియజేశారు.

# ప్రధాన సమాచార కమిషనర్‌గా జన్నత్ ప్రమాణం

రాష్ట్ర ప్రధాన సమాచార కమిష నరుగా జన్నత్‌హుస్సేన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జూలై19న గవర్నరు ఇ.ఎస్.ఎల్.నరసింహన్ ఆయనతో ప్రమా ణం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్వీప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సమాచారశాఖ కమి షనర్లు ఆర్.దిలీప్‌రెడ్డి, కె.సుధా కర్‌రావు, ఏ.సుబ్బారావు, ఎంపీ కేవీపీ రామచం ద్రరావు ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం తర్వాత జన్నత్‌హుస్సేన్ రాష్ట్ర సమాచార కమిషనరు కార్యాల యానికి వెళ్లి లాంఛనంగా పదవీబాధ్యతలు స్వీకరించారు. ఆతర్వాత ముఖ్యమంత్రి రోశయ్యను, స్పీకరు కిరణ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు.



జన్నత్ హుస్సేన్‌తో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్

ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి లోవున్న జన్నత్‌హుస్సేన్ స్వచ్ఛంద పదవీవిరమణ (వీఆర్‌ఎస్) చేశారు. అఖిలభారత సర్వీసునుంచి స్వచ్ఛంద పదవీ విరమణకోసం ఆయన పెట్టుకున్న దరఖాస్తుకు ఆమోదం లభించింది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్వీ ప్రసాద్ పేరిట ఆయన దరఖాస్తును ఆమో దిస్తూ ఉత్తర్వు జారీఅయ్యింది. జన్నత్‌హుస్సేన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కుగ్రామం పచ్ మోహనిలో అతిసామాన్య కుటుంబంలో జన్మించారు. బాల్యంలో ఆ గ్రామ పాఠశాలలోనే చదువుకున్నారు. తండ్రి వ్యవసాయదారు. జన్నత్ బంధువులు, స్నేహితులలో ఎక్కువమంది సామా న్యులే వున్నారు. ఈకారణంగానే జన్నత్‌హుస్సేన్ ప్రధాన సమాచార కమిష నరుగా సామాన్యులు కోరే సమాచారం సకాలంలో అందజేసి వారి హక్కులను కాపాడితీరతారని రాష్ట్రంలోని జనసామాన్యం భావి స్తున్నది. జన్నత్ కూడా తనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని సామాన్యులకు న్యాయంచేయాలనే అభిప్రా యంతో వున్నారు. సమాచారహక్కు చట్టాన్ని పూర్తిగా అధ్యయనం చేయడానికి ఆయన అప్పుడే నడుంకట్టారు. ఆర్టీఐ చట్టం అమ లులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శరాష్ట్రంగా మార్చడానికి కృషి చేస్తానని ఆయన పత్రికలవారితో చెప్పడం గమనార్హం.

## విద్యార్థులకు స.హ.చట్టంపై అవగాహన అవసరం

సమాచార హక్కుచట్టం విధివిధానాలను విద్యార్థిదశలోనే తెలు సుకుంటే ముందు ముందు వారికి ఉపయోగకరంగా వుంటుందని జన్నత్‌హుస్సేన్ అభిప్రాయపడ్డారు. హైదరాబాదు నగరంలోని సిటీకాలేజీలో జూలై 29న 'సమాచారహక్కు చట్టం' అంశంపై ఏర్పా టుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యక లాపాలలోని అక్రమాలను వెలికితీయడానికి ఈ చట్టం దోహద పడుతుందని ఆయన చెప్పారు. సమాచార కమిషనరుకు ఫిర్యాదు చేసిన 30 రోజులలో సమస్యపై సమాచారం అందుతుందన్నారు. సిటీకాలేజీ ప్రిన్సిపల్ కె.వి.ఎల్.ఎన్. శర్మ ఈ సందర్భంగా జన్నత్‌హుస్సేన్‌కు శాలువా కప్పి సన్మానించారు. •

## ప్రెస్ రిజిస్ట్రార్‌గా జయరాజ్ బాధ్యతల స్వీకారం

భారత సమాచార సర్వీస్ 1982 బ్యాచ్ అధికారి టి. జయరాజ్ భారత వార్తా పత్రికల ప్రెస్ రిజిస్ట్రార్‌గా జూలై 30న బాధ్యతలు స్వీకరించారు. జయరాజ్ ఇంత కుముందు జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. •

# వార్తలు వ్యాఖ్యలు కలగాపులగం

## దివంగత జర్నలిస్టు రాజేంద్రప్రసాద్ పుస్తకావిష్కరణ సభలో కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి వ్యాఖ్య

జర్నలిజంలో విలువలు నానాటికీ తరిగిపోతూ వార్తలకు, వ్యాఖ్యలకు మధ్య విభజనరేఖ చెరిగిపోతున్నదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. సంపాదకుడికి తాను రాసే సంపాదకీయంలో మాత్రం వ్యాఖ్యలుచేసే పూర్తిస్వేచ్ఛ వుంటుందని, వార్తలలో మాత్రం నిజాలకే ప్రాధాన్యం యివ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. ది హిందూ ఆంగ్లదినపత్రిక బ్యూరోచీఫ్ దివంగత రాజేంద్రప్రసాద్ రాసిన 'పొలిటికల్ మూవ్‌మెంట్ ఇన్ ఆంధ్రా' పుస్తకాన్ని జైపాల్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాదు నగరంలోని అమీర్‌పేట గ్రీన్‌పార్కు హొటలులో జూలై 11న ఈ పుస్తకావిష్కరణ సభ జరిగింది. రాజేంద్రప్రసాద్ రాసిన వ్యాసాల సంకలనంతో ఆయన కుటుంబ సభ్యులు ఈ పుస్తకాన్ని వెలువరించారు. ప్రముఖ జర్నలిస్టు ఐ. వెంకట్రావు పుస్తకం తొలిప్రతిని అందుకున్నారు. ఈ సందర్భంగా డేట్‌లైన్ ఆఫ్ ఆంధ్ర పేరుతో రూపొందించిన వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

కల్పితాలకు అతీతంగా వాస్తవికత ఉట్టిపడేలా వార్తలు వుండాలని జైపాల్‌రెడ్డి సూచించారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు తమ రంగాలలో విలువలను దిగజార్చడంలో పోటీపడుతున్నట్టు కనిపిస్తున్నదని ఆయన చమత్కరించారు. ఈధోరణికి త్వరగా ముగింపు పలకాలని ఆయన అన్నారు. సమాజ పరిరక్షణలో కీలకమైన పాత్రికేయరంగం తన బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం వుందన్నారు. రాజేంద్రప్రసాద్ మంచి జర్నలిస్టని జైపాల్‌రెడ్డి కొనియాడారు. రాజకీయ అంశాలతోపాటు ఆర్థికరంగం, సాగునీరు, అభివృద్ధి తదితరాల గురించి కూడా ఆయన మంచి కథనాలు రాశారని చెప్పారు. ఆయా సమస్యలపై సమగ్రంగా అధ్యయనంచేసి కథనాలు రాసేవారన్నారు. నైతిక విలువలకు ప్రాధాన్యం యిచ్చేవారని చెపుతూ యిప్పటి జర్నలిస్టులు రాజేంద్రప్రసాద్ పాటించిన విలువలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

రాజేంద్రప్రసాద్ వృత్తిలోనూ, వ్యక్తిగాను విలువలకు ప్రాధాన్యం యిచ్చేవారని విశాలాంధ్ర మాజీ ఎడిటర్ సి. రాఘవాచారి పేర్కొన్నారు. ఆయా విషయాల గురించి రాజేంద్రప్రసాద్‌కు ఖచ్చితమైన అభిప్రాయాలుండేవని, అయితే అవి తన వార్తలలో ప్రతిబింబించకుండా ఆయన జాగ్రత్తపడేవారన్నారు. వార్తలను నిష్పక్షపాతంగా రాసేవారన్నారు.

రాజేంద్రప్రసాద్ జర్నలిజంలోకి కొత్తగా ప్రవేశించే వారిని బాగా ప్రోత్సహించేవారని విశాలాంధ్ర రెసిడెంట్ ఎడిటర్, ఐజేయూ సెక్రటరీ జనరల్ కె. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వృత్తి విషయంలో నిబద్ధత కనబరచేవారన్నారు. వృత్తి ధర్మ నిర్వహణలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావివ్వని గొప్ప జర్నలిస్టుగా రాజేంద్రప్రసాద్ అందరికీ సుపరిచితులన్నారు. రాజేంద్రప్రసాద్ వ్యక్తిత్వం, వృత్తిజీవితం రెండూ గొప్పవేనని మహా టీవీ ఎడిటర్ ఐ. వెంకట్రావు కొనియాడారు. తాను నమ్మినదాన్ని రాయడానికి ఆయన ఏనాడూ వెనుకాడలేదన్నారు. సీనియర్ పాత్రికేయుల అనుభవాలనుంచి ఈ తరం జర్నలిస్టులు తెలుసుకోవాల్సినవి, నేర్చుకోవాల్సినవి చాలా వున్నాయని ఏపీయూడబ్ల్యూజే నాయకుడు దేవులపల్లి అమర్ అన్నారు. తాను ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా వున్నప్పుడు పలువురు సీనియర్ జర్నలిస్టుల అనుభవాలను రికార్డు చేశామన్నారు. ఇవి భవిష్యత్తరాలకు మార్గదర్శకంగా వుంటాయన్నారు. రాజేంద్రప్రసాద్ గ్రామీణస్థాయి వరకు వెళ్లి పూర్తిసమాచారం సేకరించి వార్తా కథనాలు రాసేవారని గుర్తుచేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరితో కలిసిపోయేవారని, అహంభావంలేని సుగుణశీలి అన్నారు.

ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి నరేంద్రలూథర్, పౌరసంబంధాలశాఖ మాజీడైరెక్టరు సీవీ నరసింహారెడ్డి, రిటైరయిన ఐఏఎస్ అధికారి లక్ష్మినారాయణ మాట్లాడారు. రాజేంద్రప్రసాద్ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ప్రెస్ అకాడమీ నిక్షిప్తంచేసిన రాజేంద్రప్రసాద్ అనుభవాల క్లిప్పింగులను, ప్రముఖులతోవున్న ఆయన ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. •

**సీనియర్ జర్నలిస్టు ముచ్చట్లు**

# డేట్‌లైన్ ఆంధ్రా

**- దేవులపల్లి అమర్**

# రాజేంద్రప్రసాద్ అనుభవాలు జ్ఞాపకాలు

పత్రికా రచన, ప్రచురణలకు సంబంధించి జర్నలిస్టుల ఉపయోగార్థం పాఠ్యపుస్తకాలు ఎన్నో వచ్చాయి. పాఠ్యపుస్తకాలు ఎన్నొచ్చినా యూనివర్శిటీలు, విద్యాసంస్థలూ జర్నలిజంలో ఎన్ని కోర్సులు ప్రవేశపెట్టినా అంతిమంగా ఈ వృత్తిలో సీనియర్ల అనుభవాలే యువ జర్నలిస్టులకు మార్గదర్శకాలు అవుతాయి. సీనియర్ల అనుభవాలనుంచి యువ జర్నలిస్టులు నేర్చుకోవాల్సింది, నేర్చుకోగలిగేది చాలా వుంటుంది. సీనియర్ల జ్ఞాపకాలు, అవి ఏ రంగంలోనైనాసరే, తరువాతి తరాలకు 'గైడ్'లుగా ఉపయోగపడతాయి. అందుకే ఆయా రంగాల ప్రముఖులు తమ అనుభవాలు తమతోనే అంతం అయిపోకుండా అవి ముందు తరాలకు ఉపయోగపడేందుకు వీలుగా గ్రంథస్థం చెయ్యాలి.

అటువంటి ఒక గ్రంథం ఆర్.జె. రాజేంద్రప్రసాద్ అసంపూర్తి అనుభవాల సంచిక. జర్నలిజం వృత్తిలో ఉన్నవారూ, ఆ వృత్తితో అంతోయింతో పరిచయం ఉన్నవారు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారైతే ఆర్.జె. రాజేంద్రప్రసాద్ తెలియకుండా ఉండరు. స్నేహితులూ, వృత్తిలోని సహచరులూ ఆయనను ఆర్.జె.ఆర్. అని పిలుచుకుంటారు.

జర్నలిజంరంగంలో నిష్ణాతులైనవారు అనేకమంది గతంలో తమ అనుభవాలను గ్రంథస్థం చేశారు. ఎం. చలపతిరావు (ఎంపి) 'ఫ్రాగ్మెంట్స్ ఆఫ్ రెవెల్యూషన్', కోటంరాజు రామారావు 'పెన్ యాజ్ మై స్వోర్డ్', కుందూరు ఈశ్వరదత్ 'స్టేట్ ఆఫ్ ఇంక్', ఇట్లా అనేకమంది సీనియర్ జర్నలిస్టులు తమ అనుభవాలను గ్రంథస్థం చేసారు. ఆ వరుసలోనే ఆర్.జె.ఆర్. 'డేట్ లైన్ ఆంధ్ర' ఈ రోజున చేరుతున్నది. ఆర్.జె.ఆర్. అంత తొందరగా మరణిస్తానని అనుకుని ఉండరు. అందుకే ఆయన వృత్తిలో తన జ్ఞాపకాలు, అనుభవాలూ ఇంకా పూర్తిగా రాయనే లేదు. 2006లో ఆయన మరణానికి ముందే రాష్ట్రంలో రాజకీయ ఉద్యమాలమీద ఒక గ్రంథం రచించారు. ది హిందూ దినపత్రికలో ఆయన హైదరాబాదులో బ్యూరో చీఫ్‌గా, డిప్యూటీ ఎడిటర్‌గా 1971 నుంచి 2002 వరకు, అంటే 31 సంవత్సరాలు పనిచేసారు. ఇంకొక సంవత్సరం పదవీకాలం మిగిలి ఉండగానే రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఆయన కావాలనుకుంటే ది హిందూ యాజమాన్యం ఇంకెంతకాలమైనా ఆయ నను ఉద్యోగంలో కొనసాగింపజేసేది. నేను కొన్ని పుస్తకాలు రాయాలనుకుంటున్నాను, దాని కోసమే నా మిగతా కాలాన్ని వెచ్చిం చదలిచాను అని ఆయన సహచరులతో, సన్నిహితులతో చెప్పారు. కాని ఆయన ఆ పని పూర్తి చేయలేకపోయారు. అయితే ఎప్పటికప్పుడు ఆయన తన జ్ఞాపకాలను కంప్యూటర్‌లో భద్రపరిచారు. అట్లా భద్ర పరిచిన మేరకు ఆర్‌జెఆర్ మరణానంతరం ఆయన కుమారులు పుస్తకరూపంలో తీసుకొచ్చి సరైన నివాళి అర్పించారు. ఆయన వృత్తి అనుభవాలతోబాటు గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఉద్యమాలమీద చేసిన రచనను కలిపి "డేట్‌లైన్ ఆంధ్రా, ఎన్ ఓవర్ వ్యూ ఆఫ్ పొలిటికల్ మూవ్‌మెంట్స్ ఇన్ ఆంధ్రా"గా ప్రచురించారు. సీనియర్ సంపాదకులు సి. రాఘవాచారి ఈ గ్రంథానికి రాసిన ముందుమాటలో చెప్పినట్లుగా గత నాలుగు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్ర పట్ల ఆసక్తి గలవారెవరైనా ఆర్‌జెఆర్ గ్రంథం తప్పనిసరిగా చదవాలి. ముఖ్యంగా జర్నలిస్టులు. మద్రాస్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలే ఖరిగా 1961లో ప్రారంభం అయిన ఆయన జర్నలిస్టు జీవితం 2002లో హైదరాబాద్‌లో ది హిందూ డిప్యూటీ ఎడిటర్‌గా 40 ఏళ్లపాటు కొనసాగింది.

మద్రాస్, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఆయన రిపోర్టింగ్‌లో తనకు ఎదురైన అనుభవాలను చాలా సరళమైన ఇంగ్లీషులో అందరికీ అర్థమయ్యే రీతిలో రాసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆనాటి జర్నలిజం ఎట్లా ఉండేదో, వివిధ రకాల మనస్తత్వాలు గల వ్యక్తులను గురించిన విషయాలను ఆయన ఎట్లా రిపోర్టు చేసారో ఈ పుస్తకంలో చదవొచ్చు. పి.వి. నరసింహారావు దగ్గరినుంచి చంద్రబాబు నాయుడు వరకూ ఆయన మన రాష్ట్రంలోని పలువురు ముఖ్యమంత్రులను చాలా

దగ్గరినుండి చూసారు. ఎక్కడా వొత్తిడులకు లొంగకుండా నాలుగు దశాబ్దాలపాటు జర్నలిజం వృత్తిలో కొనసాగడం, అత్యున్నత స్థానానికి ఎదగడం, అందరి ప్రశంసలు పొందడం ఆర్.జె.ఆర్. వంటి కొందరు పాత్రికేయులకే సాధ్యం అవుతుందని ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుంది.

మద్రాసులో జర్నలిస్టుగా అనుభవాలను 'నా మద్రాసు జర్నలిజం రోజులు' అన్న అధ్యాయంలో ఆయన తొలిరోజుల్లో జర్నలిస్టు ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొంటారో చాలా బాగా రాసారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరగానే ఆయనకు 'చెపాక్ బీట్' అప్పగించారట. బీట్ అంటే జర్నలిజం భాషలో ఆ ప్రాంతంలో ఏం జరిగినా సమాచారం సేకరించి పత్రికకు వార్త రాయడం. చెపాక్ ఇప్పటి చెన్నైలో ఒక ఏరియా. అప్పట్లో ది హిందూకు రంగారావు అనే విలేఖరి ఆ బీట్ చూస్తుండేవాడు. రాజేంద్రప్రసాద్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు, ఆర్.కె.కె. మీనన్ మెయిల్ పత్రికకు విలేఖరులు. ఆ రోజుల్లో ఈ మూడు ప్రధాన దినపత్రికలు. రంగారావు రోజూ ఏదో ఒక ప్రత్యేక వార్త రాసి మిగిలిన ఇద్దరు విలేఖరులను ఇబ్బందుల పాలు చేస్తుండేవాడట. వార్తలు 'మిస్' అవుతున్నారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో రాజేంద్రప్రసాద్‌ను అడిగేవారు.

ఒక రోజు ఎలాగైనా హిందూకు దక్కని సమాచారంతో వార్త రాయాలని ఆర్జెఆర్ నిర్ణయించుకున్నారు.చెపాక్ ప్రాంతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి. ఒక రోజు మధ్యాహ్నం మిగిలిన విలేఖరులు ఆఫీసులకు వెళ్లిపోయాక ఆయన తిరిగి చెపాక్ వెళ్లారు. అక్కడ బకింగ్‌హామ్ కెనాల్ ప్రాజెక్టు డైరెక్టరు కార్యాలయానికి వెళ్లి వివరాలు సేకరించి వార్తగా రాసారు. మరునాడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మాత్రమే ఆ వార్త అచ్చుయింది. తరచూ ఇతరులకు తెలియకుండా ప్రత్యేక వార్తలు రాసే హిందూ రంగారావు మరునాడు చెపాక్‌లో విలేఖరులు అందరూ కలుసుకున్నప్పుడు ఇట్లా ప్రత్యేక వార్తలు రాసి ఇతరులను ఇబ్బంది పెట్టొద్దు అని సూచించారట.




**"డేట్‌లైన్ ఆంధ్రా అండ్ ఏన్ ఓవర్‌వ్యూ ఆఫ్ పొలిటికల్ మూవ్‌మెంట్స్ ఇన్ ఆంధ్ర"**

**రచన: ఆర్.జె.రాజేంద్రప్రసాద్**

**ప్రచురణకర్త: ఆర్.ఎస్.ప్రసాద్**

**దొరుకుచోటు: రాష్ట్రంలోని విశాలాంధ్ర బుక్‌హౌజ్ అన్ని బ్రాంచీల్లోనూ**

**వెల: 200 రూపాయలు**

తరువాతి రోజుల్లో ది హిందూలో చేరి విజయవాడలో పనిచేసారు. అక్కడినుండి హైదరాబాద్ బదిలీ అయ్యారు. రాజేంద్ర ప్రసాద్ హైదరాబాద్ రాకముందు హిందూ దిన పత్రికకు హెచ్. వెంకన్న బ్యూరో చీఫ్‌గా ఉండేవారు.

1969లో ఒక రోజు హఠాత్తుగా మూసీ నదికి గండిపడి హైదరాబాద్‌ను ముంచెయ్యబోతున్నదని పుకారు లేచింది. ప్రజలు ఇళ్లు వొదిలేసి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని వీధుల్లో పరుగులు తీసారు. అప్పుడు వెంకన్న హిందూ కేంద్ర కార్యాలయానికి టెలిప్రింటర్‌లో ఒక మెసేజ్ పంపారు. దాని సారాంశం తమ ప్రాణాలను రక్షించుకోవడంకోసం హైదరాబాద్ ఆఫీసు మూసేస్తున్నామని. అది పుకారు మాత్రమేనని వెంటనే తెలిసింది.

ఏదైనా ఉపద్రవం సంభవించినప్పుడు మరింత అప్రమత్తంగా ఉండి అదంతా పత్రికకు రిపోర్టు చేయాల్సిన జర్నలిస్టు ఆఫీసు మూసుకుని పోవడాన్ని హిందూ యాజమాన్యంనుంచి మందలింపు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇంకోసారి హిందూ ఆఫీసు కారు రిపేరు తాలూకు 25 రూపాయల బాకీ డబ్బు వర్క్‌షాపు వారికి చెల్లించడంకోసం హెడ్ ఆఫీసుకు "అప్పుల వాళ్లనుండి నన్ను రక్షించండి" అని టెలిప్రింటర్ మెసేజ్ ఇచ్చారట.

ఈ సంఘటన నేపథ్యంలోనే యాజమాన్యం వెంకన్న స్థానంలో ఆర్.జె.ఆర్‌ను హైదరాబాద్ బ్యూరో చీఫ్‌గా నియమించింది.

చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఓసారి ఆంగ్ల వారపత్రిక 'సండే' విలేఖరి ప్రభుత్వ పనితీరు మీద వార్తాసేకరణకు హైదరాబాద్ వొచ్చాడు. చెన్నారెడ్డి అనుయాయులు ఆ విలేఖరిని కొంచెం బాగా చూసుకుంటే తమ నాయకుడికి అనుకూలమైన వార్త వొస్తుందనుకున్నారు. ఆ విలేఖరిని లేక్‌వ్యూ అతిథి గృహంలో ఉంచి అన్ని సౌకర్యాలూ కల్పించారు. సమాచార

శాఖ అధికారి ఒకరు ఆయన వెంటనే ఉండి నాలుగు రోజులపాటు సకల సదుపా యాలూ కల్పించారు. ఆ విలేఖరి మాత్రం తిరిగి వెళ్లి రాసిన వార్తాకథనం శీర్షిక "చెన్నారెడ్డి:అత్యంత అవినీతి పరుడైన ముఖ్యమంత్రి".

జర్నలిస్టుల పట్ల రాజకీయ నాయకులకు పలు సందర్భాలలో ఉండే తప్పుడు అభిప్రాయాలను ఆర్.జె. ఆర్. ఇటువంటి ఉదాహరణల ద్వారా తన పుస్తకంలో బాగా వివరించారు.

వార్తల వెనుక వార్తలు ఎట్లా ఉంటాయో ఆర్.జె.ఆర్ బాగా వివరిస్తారు. ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా గవర్నర్ శంకర్ దయాళ్‌శర్మ, ఢిల్లీ గవర్నర్ల సభలో చేసిన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను గవర్నర్ కార్యదర్శి స్వయంగా ఆర్.జె. ఆర్‌కు అందించిన సంఘటన మంచి ఉదాహరణ.

తెలంగాణ ప్రజాసమితి తరపున పార్లమెంటుకు పోటీచేసిన అభ్యర్థులకు కొందరికి ఎన్నికల ఖర్చుకోసం కాంగ్రెస్‌పార్టీ నిధులు సమకూర్చిందన్న వార్త దిహిందూ ప్రత్యేక ప్రతినిధి జి.కె. రెడ్డి రాస్తే చెన్నారెడ్డి ఆర్.జె.ఆర్‌ను పట్టుకుని జి.కె.రెడ్డి కాంగ్రెస్‌పార్టీ కోశాధికారి ఎప్పుడయ్యారని ప్రశ్నించిన ఉదంతం, దాని తరువాత జరిగిన వ్యవహారం...చాలా సన్నిహితంగా మెలిగే రాజకీయ నాయకులు తమకు రుచించని వార్తలు పత్రికల్లో వొస్తే ఎట్లా వ్యవహరిస్తారనడానికి ఇట్లాంటి ఉదాహరణలు ఆర్.జె.ఆర్ తన పుస్తకంలో చాలానే రాసారు. ఆయా సందర్భాలలో సంపాదకులు తనకు అండగా నిలిచిన తీరు, యాజమాన్యంలోని కొందరు తన ధోరణి మార్చుకోమని వొత్తిడి తెచ్చిన తీరు గురించి ఆయన చాలా బాగా రాసారు ఈ పుస్తకంలో.

బుజ్జగింపులను, బెదిరింపులను ఎదుర్కొంటూనే, సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూనే ఒక వర్కింగ్ జర్నలిస్టు తన వృత్తిపట్ల నిబద్ధతను, నిజాయితీని ఎట్లా కాపాడుకోవాలో, విశ్వసనీయతను ఎట్లా సంపాదించుకోవాలో ఈ గ్రంథంలో ఆర్.జె.ఆర్ రాసిన అనేక సంఘటనల ద్వారా అర్థం అవుతుంది.

జర్నలిజాన్ని పూర్తికాలం వృత్తిగా స్వీకరించి, అందులోనూ ఉత్తమ లక్షణాలను అలవరచుకోవాలనుకునే వారందరికీ ఈ అనుభవాల సంచిక ఒక మంచి గైడ్. •

## జర్నలిస్టులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు

**రాష్ట్రంలో** యిప్పటివరకు 750 మంది జర్నలిస్టులకు ఆరోగ్యశ్రీ కార్డులు యిచ్చామని ఆరోగ్యశ్రీ శాఖమంత్రి పితాని సత్యనారాయణ చెప్పారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు యిస్తామని ఆయన స్పష్టంచేశారు. కాంగ్రెస్ సభ్యుడు కందుల లక్ష్మీదుర్గేష్ జూలై12న శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు 20 కేసులకు ఐదు లక్షల రూపాయలు చెల్లించామని మంత్రి సత్యనారాయణ చెప్పారు. గత డిసెంబరులోనే జర్నలిస్టులకు ఆరోగ్యశ్రీ కార్డులు యివ్వాలని నిర్ణయించినప్పటికీ ఎన్నికల కారణంగా హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాలలో పనిచేస్తున్న జర్నలిస్టులక్కూడా కార్డులు జారీచేయలేక పోయామన్నారు. ఏపిఎల్, బీపిఎల్ పరిధిలోని జర్నలిస్టులతోపాటు రిటైరయిన జర్నలిస్టులకూ కార్డులు యిస్తామన్నారు. రాజమండ్రిలో 300కుపైగా జర్నలిస్టులుంటే కేవలం 11మందికే ఆరోగ్యశ్రీ కార్డులు యిచ్చారని లక్ష్మీదుర్గేష్ మంత్రి దృష్టికి తెచ్చారు. కంట్రిబ్యూటర్లక్కూడా ఈ కార్డులు యివ్వాలని ఆయన కోరారు. •

## ఆట-5 కేసులో ప్రభుత్వానికి నోటీసులు

**జీ తెలుగు** చానెల్‌లో ప్రసారమవుతున్న ఆట-5 రియాల్టీ షోను నిలిపివేయాలని కోరుతూ దాఖలయిన పిటిషన్ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. చిన్నారుల హక్కుల పరిరక్షణ సంఘం, మరో యిద్దరు సంయుక్తంగా దాఖలుచేసిన ఈ పిటిషన్ను జూన్ 23న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిస్సార్ అహ్మద్ కుక్రు, జస్టిస్ విలాస్ వి. అఫ్జల్ పుర్కర్‌లున్న డివిజనుబెంచి విచారించింది. కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ కార్యదర్శి, రాష్ట్ర విద్య, కార్మిక, సమాచార పౌర సంబంధాలు, హోంశాఖల కార్యదర్శులను, నగర పోలీసు కమిషనరును, జీ తెలుగు చానెల్‌ను పిటిషనులో ప్రతివాదులుగా చేర్చారు. మానవహక్కుల కమిషన్ ఆట-5 రియాల్టీ షోపై విధించిన నిషేధంపై హైకోర్టు జూన్ 18న స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆ చానెల్ పిల్లలతో మళ్లీ అశ్లీల నృత్యాల ప్రసారాలను మొదలుపెట్టిందని, ఆ షోను నిలిపివేయాలంటూ దాఖలయిన పిటిషనులో తెలిపారు. షో నిలిపివేసి నిర్వాహకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

### స్వీయ నిబంధనలకు ఆమోదం

కొన్ని చానెళ్లు ఏర్పరచుకున్న స్వీయ మార్గదర్శకాలను ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ ఫౌండేషన్ ఆమోదించింది. అయితే ఈ నిబంధనలు నిరంతరం వార్తలను ప్రసారంచేసే చానెళ్లకు వర్తించవు. •

# స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించండి

## ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

ఫ్రీలాన్స్ జర్నలిస్టు హేమచంద్ర పాండే మృతికి దారితీసిన పరిస్థితులను కనుగొనడానికి, ప్రజలలో ప్రత్యేకించి జర్నలిస్టుల మనస్సులలో వున్న సందేహాలను తొలగించడానికి ప్రభుత్వం వెంటనే స్వతంత్ర సంస్థతో విచారణ జరిపిం చాలని ఐజేయూ సెక్రటరీ జనరల్ కె. శ్రీనివాస రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి వై. నరేందర్‌రెడ్డి జూలై 6న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసులు ప్రకటించినట్టు ఎన్‌కౌంటరులో మావో యిస్టు నాయకుడు ఆజాద్‌తోపాటు చనిపోయిన రెండో వ్యక్తి ఉత్తరాఖండ్ రాష్ట్ర ఫ్రీలాన్స్ జర్నలిస్టు హేమచంద్రపాండేయే అని యిప్పుడు నిస్సందేహంగా నిర్ధారణ అయిందని వారు పేర్కొన్నారు. పాండే మృతికి దారితీసిన పరిస్థితులపై

# హేమచంద్రపాండే ఎవరు?

## భిన్న కథనాలు

ఆదిలాబాద్ జిల్లా అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆజాద్‌తోపాటు చనిపోయిన హేమచంద్రపాండే ఎవరనే అంశంపై మొదట భిన్న కథనాలు వినిపించాయి. ప్రభుత్వం, పోలీసులు పాండే మావోయిస్టని తేల్చిచెప్పాయి. హేమచంద్రపాండే మావోయిస్టని తమ వద్ద నివేదిక వుందని రాష్ట్ర హెూంమంత్రి సబితా ఇంద్రారెడ్డి తాండూరులో విలేకరులతో చెప్పారు. పాండే మావోయిస్టా, జర్నలిస్టా అనే అంశంపై విచారణ జరిపిస్తామని పాండే భార్య బబిత తనను కలిసినప్పుడు హెూంమంత్రి చెప్పారు. పాండే అజ్ఞాత నక్సలైట్లని తమ రికార్డుల్లో వుందని, ఆయన స్వరాష్ట్రం ఉత్తరాఖండ్‌లోని పితోర్‌గఢ్ జిల్లా ఎస్పీ నీలేశ్ విలేకరులతో చెప్పారు. ఇదిలావుండగా మావోయిస్టు ఉత్తర ప్రాంతీయ కమిటీ అధికార ప్రతినిధి అజయ్ పేరుతో విడుదలైన ప్రకటనలో హేమచంద్రపాండే మావాడేనంటూ పేర్కొన్నారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి ఉసెండి పేరుతో వెలువడిన మరో ప్రకటనలో పాండేతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. అజయ్ పేరుతో వెలువడిన ప్రకటన నకిలీది కావచ్చునని ఉసెండి అనుమానం వ్యక్తంచేశారు.

### పాండే ముమ్మాటికీ జర్నలిస్టే

ఆదిలాబాద్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రముఖనేత ఆజాద్‌తోపాటు మరణించిన హేమచంద్రపాండే మావోయిస్టా, జర్నలిస్టా అంటూ వాదోపవాదాలు జరుగుతున్న తరుణంలోనే వీరిద్దరు బూటకపు ఎన్‌కౌంటరులో చనిపోయారనే కొత్త కోణం ఆవిష్కారమైంది. పాండే మావోయిస్టుకాదని, జర్నలిస్టేనని విశ్వసించడానికి తగిన ఆధారాలు వెల్లువెత్తాయి. ఆ ఆధారాల నేపథ్యంలో ఆజాద్‌తోపాటు చనిపోయిన రెండోవ్యక్తి ఉత్తరాఖండ్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు హేమచంద్రపాండేయేనని యిప్పుడు నిస్సందేహంగా నిర్ధారణ అయిందని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే సంయుక్తంగా విడుదలచేసిన ప్రకటనలో పేర్కొనడం గమనార్హం.

పాండే ఫ్రీలాన్స్ జర్నలిస్టని ఆయన భార్య బబిత పేర్కొన్నారు. హిందీ పత్రికలు నయీ దునియా, రాష్ట్రీయ సహారా, దైనిక్ జాగరణ్‌లకు కథనాలు రాసేవారని ఆమె వివరిస్తూ సాక్ష్యాధారాలను కూడా బయటపెట్టారు. పాండే రాసిన కథనాల క్లిప్పింగులతోపాటు ఢిల్లీ నుంచి వెలువడే చేతన యాజమాన్యం యిచ్చిన వేతన ధృవపత్రాన్ని కూడా బబిత, యితర కుటుంబ సభ్యులు ఢిల్లీలో విడుదలచేశారు. ఉత్తరాఖండ్ నుంచి వెలువడే 'నైనిటాల్ సమాచార్' సంపాదకుడు రాజీవ్‌లోచన్ సాహూ కూడా తనకు హేమచంద్రపాండే జర్నలిస్టుగా తెలుసునని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా, పాండే స్నేహితుడు భూపేన్, పితోర్‌గఢ్ జిల్లా పాత్రికేయులు కూడా హేమచంద్రపాండే జర్నలిస్టుగా తమకు తెలుసునని పేర్కొన్నారు. పాండే మావోయిస్టు పార్టీ కార్యకర్త కాదని ది హిందూలో వార్త వచ్చిందని భూపేన్ చెప్పారు. ●

సందేహాలను నివృత్తి చేయకపోతే రాష్ట్రంలోని జర్నలిస్టులను భయభ్రాంతులను చేయ డానికి, పత్రికా స్వేచ్ఛకు భంగంకలిగించే పోలీసుల చర్యను ఆమోదించేలా వారిని వేధించడానికి ఒక జర్నలిస్టును చంపినట్టు భావించాల్సి వుంటుందని శ్రీనివాసరెడ్డి, నరేందర్‌రెడ్డి ఆ ప్రకటనలో హెచ్చరిం చారు. ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించి సందేహాలను నివృత్తిచేయాలని కూడా వారు కోరారు.

పాండే మృతదేహంతో ఊరేగింపుగా సచివాలయంవైపు వెళ్లడానికి జర్నలిస్టులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బాబూఖాన్ ఎస్టేట్ వరకు ఊరేగింపుగా వెళ్లడానికి అనుమతించారు. ఆ తర్వాత పాండే కుటుంబ సభ్యులు పాండే మృతదేహంతో ఢిల్లీకి బయలుదేరారు.

## పూర్తి విచారణ జరపాలి:శ్రీనివాస్

ఇటు ప్రభుత్వం, అటు పోలీసులు పాండేను మావోయిస్టుగా ప్రకటించడం అనుమానాస్పదంగా వుందని ఆంధ్రజ్యోతి ఎడిటరు కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. పూర్తి విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## ఎలక్ట్రానిక్ మీడియా డిమాండ్

జర్నలిస్టు హేమచంద్రపాండే మృతిపై విచారణ జరిపించాలని, ఆయనను కాల్చి చంపిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు చందు జనార్దన్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ క్రాంతికిరణ్, ఉపాధ్యక్షుడు సాబిర్ ఒక ప్రకటనలో డిమాండుచేశారు. విధి నిర్వహణలో భాగంగా కవరేజికి వెళ్లిన జర్నలిస్టు పాండేను ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు కాల్చి చంపడం అమానుషమని వారు పేర్కొన్నారు. ●

# మూకుమ్మడిగా సిగ్గుపడాల్సిన పనిలేదు

తేది:7-7-2010
శ్రీ కె.శ్రీనివాస్,
సంపాదకులు,
ఆంధ్రజ్యోతి దినపత్రిక,
హైదరాబాద్.

మిత్రులు శ్రీనివాస్‌గారికి,

జూలై 7వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'జనవాక్యం' శీర్షిక కింద 'మూకుమ్మడిగా సిగ్గుపడదాం' హెడ్డింగ్‌తో ప్రచురించిన తిగుళ్ల కృష్ణమూర్తి లేఖను చూశాను. ఆయన భావించినట్లుగా జర్నలిస్టులంతా మూకుమ్మడిగా సిగ్గుపడాల్సిన పనిలేదు. హేమ్ చంద్రపాండే భౌతికకాయాన్ని బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్ వద్దకు తీసుకువచ్చిన బాధ్యులెవరో వారు ఆలోచించుకోవాలి. ప్రెస్‌క్లబ్‌లో ఆయన భౌతికకాయాన్ని సందర్శనకు పెడతామని ఎవరైనా ప్రకటించారా? అలాంటి ప్రకటనేమైనా చేసి ఉంటే, ప్రెస్‌క్లబ్ బాధ్యులతో ముందు సంప్రదించారా? అలాంటి పని ఎవరూ చేయలేదనే విషయం కృష్ణమూర్తిగారికి తెలియనందున సహజంగానే ఆవేశపడ్డారు. భౌతికకాయం బషీర్‌బాగ్‌కు చేరుకోవడానికి కేవలం కొద్ది నిమిషాలకు ముందు కొందరు మిత్రులు ప్రెస్‌క్లబ్ కార్యాలయానికి వచ్చి భౌతికకాయాన్ని హాలులో పెడతామని ఏకాఏకిన ప్రతిపాదించారు. ఆ సమయంలో అక్కడ గతంలో హాలును బుక్ చేసుకున్న ఒక సంస్థ మీటింగ్ కొనసాగుతోంది. అయితే భౌతికకాయాన్ని గేటు ముందు పెడతామన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రవేశద్వారం వద్ద పరిస్థితి ఏమిటో అక్కడ చూసినవారికే తప్ప ఇతరులకు అర్థం కాదు. ఈ ఆకస్మిక పరిణామానికి విస్తుపోయాం. దీనికి ఎవరు బాధ్యత వహించాలి? కృష్ణమూర్తి తన లేఖలో "లోపలికి అనుమతించడం సాధ్యం కాదనుకుంటే, అదే విషయాన్ని ముందుగానే వారికి తెలియజేస్తే, వారి ఏర్పాట్లేవో వారు చేసుకునే వారు. లేదా అటునుంచి అటే తీసుకువెళ్ళిపోయేవారు" అని పేర్కొన్నారు. నిజానికి ఆ విషయమేది ప్రెస్‌క్లబ్ బాధ్యులకు లేదా యూనియన్ బాధ్యులకు కూడా తెలియనప్పుడు, ముందుగానే తెలియజేసే ప్రసక్తే ఉదయించదు. మంగళవారం బషీర్‌బాగ్ వద్ద జరిగిన పరిణామాలకు యూనియన్ లేదా ప్రెస్‌క్లబ్ బాధ్యులు కాదు. దీనికి సమాధానం చెప్పాల్సింది బషీర్‌బాగ్‌కు భౌతికకాయాన్ని తీసుకువచ్చిన బాధ్యులే.

మరో విషయాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించాలి. ఇలాంటి సందర్భాలలో చిత్తం వచ్చిన రీతిలో వ్యవహరించే కుత్సిత స్వభావం గల బాధ్యతారహిత వ్యక్తులు కొందరు చేరుతుంటారు. వికృత చర్యలకు పూనుకుంటారు.ఇలాంటి వారి చర్యల వల్లనే కొద్దినిమిషాల పాటు అక్కడ జుగుప్స కలిగించే వాతావరణం నెలకొంది. అలాంటి వారి గురించి మనమేమి అనగలం!

కె.శ్రీనివాస్‌రెడ్డి,
సెక్రెటరీ జనరల్,
ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజెయు)

# పెద్దలు కాస్త పగ్గాలు వేసుకోవాలి

జర్నలిజం అవాంఛనీయంగా మారటంలో కొందరు మీడియా నిర్వాహకులు, జర్నలిస్టుల బాధ్యత ఉందని అంగీకరిస్తూనే గుర్తించక తప్పని విషయం మరొకటి ఉంది. ఈ రంగం ఇట్లా మారటంలో రాజకీయవాదులు, ప్రభుత్వాలు వివిధ మోతుబరి వర్గాల పాత్ర కూడా కాదనలేనిది.

మీడియాకు నిర్వాహకులు, జర్నలిస్టులు అంటూ ప్రత్యేకంగా ఉన్నప్పటికీ ఆ రంగంతో ఈ వర్గాలకు కూడా సంబంధం ఉంది. జర్నలిజం దెబ్బతినటంలో ఇంత కాలం వీరూ తలొక చేయి వేసారు. ఇపుడది బాగుపడాలంటే కూడా తలొక చేయి వేయటం అవసరం. బాగుచేసే బాధ్యత మౌలికంగా నిర్వాహకులది, జర్నలిస్టులది అయినా అందుకు వీరి దోహదం తప్పనిసరి.

అట్లాకాకుండా మీ రంగాన్ని మీరు బాగుచేసుకొండి, మేము మిమ్మల్ని నిందించే పని మాత్రమే చేస్తుంటాం అంటే అది జర్నలిజం బాగుపడాలని నిజంగా కోరుకునే పాజిటివ్ వైఖరి కాబోదు. పైగా, పైన అనుకున్నట్లు, పరిస్థితి క్షీణించటంలో వీరు సహదోషులైనపుడు బాగుపరచ టంలోనూ బాధ్యత తీసుకోక తప్పదు. అట్లా కానప్పుడు మీడి యాను విమర్శించే నైతిక హక్కు వారికుండదు. మా తప్పులు మేము చేస్తూనే ఉంటాము గాని ఎదుటివారు మారాలనటం చెల్లనిమాట అవుతుంది.

**జర్నలిజం బాగుపడుతుంది**

## ఉమ్మడియత్నం

కనుక ఈ దిశలో మొదట జరగవలసింది జర్నలిజంలోని అవాంఛనీయ లక్షణాలు ఏమిటో, ఆ లక్షణాలు ప్రవేశించటంలో పైన పేర్కొన్న వర్గాలు ఏయే విధాలుగా కారణమవుతున్నాయో గుర్తించటం. ఈ పని స్వయంగా ఆ వర్గాలు చేయాలి. మీడియా నిర్వాహకులు, జర్నలిస్టులు చేయాలి. పాఠకులు కూడా చేయాలి. ఆ గుర్తించటం జనరల్ ఉపన్యాసాల ధోరణిలోగాక నిర్దిష్టంగా ఉండాలి. తర్వాత, అటువంటి నెగెటివ్ పాత్ర నుంచి ఆ వర్గాలు ఉపసంహరించుకోవటం ఎట్లాగనే చర్చ జరగాలి. అది కూడా నిర్దిష్టంగా ఉండాలి. ఈ చర్చ మీడియాకు బయట, లోపల ఏ వర్గానికి ఆ వర్గం చేయటంతో పాటు ఉమ్మడిగానూ సాగాలి.

చర్చ పరస్పరం నిందించుకునే ధోరణిలో గాక అందరికి సంబంధించిన ఒక మంచి పనిని అందరం కలిసి చేసేందుకు ప్రయత్నిస్తున్నామనే దృష్టితో సాగాలి. అందరూ ఎదు టివారి లోపాలను ఎత్తిచూప టంతో పాటు తమ లోపాలు ఏమిటో ప్రకటించాలి. ఎవరి లోపాలు ఏమిటన్నదానిపై సాధారణ ఏకీభావం ఏర్పడి నపుడు వాటిని సరిదిద్దుకు నేందుకు మనస్ఫూర్తిగా సిద్ధప డాలి. ఇటువంటి చర్చలు ఎంత సానుకూల దృక్ప థంతో, విశాల దృష్టితో సాగినా అన్నింటా ఏకీభావ మన్నది అసాధ్యం. కాని అందుకు నిరుత్సాహపడవలసిన పనిలేదు. ఒక చిన్న సదారంభం జరిగినా అక్కడి నుంచి ముందుకుపోవచ్చు.



టంకశాల అశోక్
'వార్త' ఎడిటర్

ఇన్నిన్ని మీడియా సంస్థలు, ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, పైన పేర్కొన్న అనేక వర్గాలు చర్చలో భాగస్వాములైనపుడు, అంగీకారాలు కుదరగల అంశాలు ఎన్నో కొన్ని ఉండవనలేము. ఎందరో కొందరి మధ్య ఏకీ భావాలు ఏర్పడవనలేము. అది ఆరంభమవుతుంది.

ఇటువంటి చర్చలకు మీడియా సంస్థలు, యూనివర్సిటీల జర్నలిజం శాఖలు, పాఠకుల బృందాలు, పౌరహక్కుల సంస్థలు చొరవ తీసుకోవచ్చు. పైన పేర్కొన్న వివిధ వర్గాల నుంచి, విజ్ఞులైన పాఠకుల నుండి ప్రతినిధులను ఆహ్వానించవచ్చు. చర్చలు మొదట హోరాహోరీగా కనిపించినా అందరూ కలిసిన వేదికపై మనసులు విప్పుకోవటం, విషయాలు ముందుకు రావటమే ఒక గొప్ప ప్రజాస్వామిక ప్రయత్నమవుతుంది. అభిప్రాయాలు ఒకరివి ఒకరికి తెలియటమేగాక పాఠక బాహుళ్యంలోకి వెళతాయి. వారూ చర్చించి ఏదో ఒక రూపంలో వెల్లడిస్తారు. ఆ మేథోమథనాల నుంచి సమస్యకు సమాధానాలు తప్పక లభిస్తాయి.

ఒక విషయంపై అందరూ పాల్గొనే ఇటువంటి బహిరంగ చర్చ జరిగినపుడు ప్రతి ఒక్కరూ తమ తమ లోపాలను మొదట తమ స్థాయిలో గుర్తిస్తారు. బయటకు కాకున్నా అంతర్గతంగా తర్వాత అర్థమనస్కంగానో, మనస్ఫూర్తిగానో బయటకు అంగీకరించవలసి

ఉంటుంది. అందరూ లేదా తగినంత మంది వేలెత్తి చూపినా తమ లోపాలను మొండిగా సమర్థించుకోవటం తెలికకాదు. మారవలసిన వత్తిడి మీడియాతో సంబంధంగల అందరిపైనా ఏర్పడుతుంది.

## ఒక ఉదాహరణ

పైన పేర్కొన్న వర్గాలలో అందరూ చేసే అవాంఛనీయమైన పనికి ఒక ఉదాహరణను గమనించండి. అది వార్తలను నియంత్రించజూసే ధోరణి. రాజకీయవాదులు, ప్రభుత్వాలు, అధికారులు, పోలీసులు, పరిశ్రమలవారు, వ్యాపారులు, భూకామందులు, కాంట్రాక్టర్లు, ఇతర పలుకుబడి వర్గాలవారు, ప్రముఖ వ్యక్తులలో అనేకులు వార్తలను తమకు నచ్చినవి-నచ్చనివి, అనుకూలమైనవి-ఇబ్బందికలిగించేవి అనే కోణాల నుంచి ప్రభావితం చేయటం సర్వసాధారణమై పోయింది. ఈ ధోరణి చాలాకాలం క్రితమే మొదలై క్రమంగా పెరిగిపోతున్నది. వారు విలేఖరులను, సంపాదకులను, నిర్వాహకులను, మీడియా అడ్వర్టయిజ్‌మెంట్ విభాగాలను ప్రభావితం చేయజూస్తుంటారు. ఒకోసారి నేరుగా, ఒకోసారి తమ పబ్లిక్ రిలేషన్స్ లేదా అడ్వర్టయిజ్‌మెంట్ విభాగాల ద్వారా.

జర్నలిజపు విలువలు, ప్రమాణాలు, ధర్మాలు భంగపడేందుకు ఇవన్నీ కారణం కావటంలేదని, కేవలం నిర్వాహకులు, జర్నలిస్టుల లోపాలే కారణమని వీరు అనగలరా? కోరుకున్న అసత్యాలు రావటం, ఇబ్బందికరమైన సత్యాలు రాకుండా ఉండటం, అక్కరలేని పబ్లిసిటీ లభించటం వంటి వాటి కోసం తాము ప్రయత్నించటంలేదని, అందుకోసం మీడియా నిర్వాహకులను, జర్నలిస్టులను ఏదో ఒక విధంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించటంలేదని వీరంతా మనస్సాక్షిగా చెప్పగలరా? ఎంత మాత్రం చెప్పలేరు. అటువంటి స్థితిలో, మీడియా అవాంఛనీయంగా మారటానికి వీరంతా తలా ఒక చేయి వేస్తూ, ఈ విషయాలు మాట్లాడకుండా కేవలం మీడియాను నిందించటం వల్ల పరిస్థితి బాగుపడుతుందా? అపుడా వైఖరి, 'మీడియా విలువలు మాకు అనుకూలమైన విధంగా భంగపడితే సంతోషిస్తాం. వ్యతిరేకమైన విధంగా భంగపడితే విమర్శిస్తాం' అన్నట్లు తయారవుతుంది. నిర్మొహమాటంగా చెప్పాలంటే ఇపుడు జరుగుతున్నది అదే.

## ఉద్దేశం నిందకాదు

ఈ మాట అనటంలో ఉద్దేశం ఈ వర్గాలను నిందించటం కాదు. లేదా వీరి లోపాలు ఉన్నాయి గనుక మీడియా నిర్వాహకులు, జర్నలిస్టుల లోపాలను ఉపేక్షించాలనటం కాదు. చేయగూడని పనులు అందరూ చేస్తున్నారు. అటువంటి స్థితిలో ఎవరికి వారు తమ లోపాలను కప్పిపెట్టుకుని ఇతరులను విమర్శించటం వల్ల జర్నలిజం ఎప్పటికీ బాగుపడదు. అన్ని వర్గాలూ దీనిని గుర్తించి, అందరూ తమ లోపాలను కన్‌ఫెషన్ బాక్స్‌లో కూర్చుని ఒప్పుకుంటూ, జర్నలిజం మనందరిది గనుక అందరం కలిసి బాగు చేసుకుందామనే వైఖరి తీసుకోవాలని చెప్పటం ఇందులోని ఉద్దేశం. జరుగుతున్నదానికి సంబంధించి పైన ప్రస్తావించింది ఒక ఉదాహరణ మాత్రమే. పైన పేర్కొన్న వర్గాల లోపాలు ఇటువంటివి ఇంకా అనేకం ఉన్నాయి. మాట వరుసకు ఈ వర్గాల వారంతా చర్చలో పాల్గొని, పైన పేర్కొన్న ఒక్కపద్ధతైనా ఇక నుంచి మానుకుంటామని ప్రకటించారనుకుందాం. ఆ ఒక్క నిర్ణయం చాలు జర్నలిజం ఎంతగానో మారటానికి. అయితే అందుకోసం ఈ వర్గాలకు నిజాయితీ, సాహసం ఉండాలి. స్వార్థప్రయోజనాలను ఆ మేరకు వదులుకోవాలి. జర్నలిజంతో సంబంధంగల వివిధ అంతర్గత, బాహిర శక్తుల స్వప్రయోజనాల ఉమ్మడి తాకిడి వల్లనే ఈ రంగం అవాం ఛనీయంగా మారుతున్నది. అందరూ వాటిని క్రమంగానైనా వదులుకునేందుకు సిద్ధపడనంత కాలం పరిస్థితి బాగుపడదు. వారట్లా వదలుకునేందుకు, జర్నలిజం బాగుపడేందుకు ఈ వర్గాలన్నింటిలోని మంచిని కోరే శక్తులు యాంటీథీసిస్‌గా పనిచేయాలి. వారిపుడు మౌనంగా ఉన్నారు. లేదా మంద్ర స్వరాలతో మాట్లాడుతున్నారు. ఆ స్వరాలు విస్తరించాలి, తీవ్రం కావాలి. పెద్దలు కాస్త పగ్గాలు వేసుకోవటం అపుడు మొదలవుతుంది.

*('వార్త' సౌజన్యంతో)*

## కాశ్మీరులో మూడు పత్రికలపై వేటు

జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం మూడు దినపత్రికల కార్యాలయాలకు, వాటి ముద్రణ కార్యాలయాలకు సీళ్లు వేసింది. దక్షిణ కాశ్మీరు జిల్లా అనంతనాగ్‌లో ఒక మతప్రదేశం దగ్ధం అంశంపై ప్రజలను రెచ్చగొట్టే విధంగా వార్తాకథనాలు ప్రచురించినందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఆ మూడు దినపత్రికలు వార్తాసేకరణ, ముద్రణ కార్యకలాపాలు చేపట్టకూడదని ఆదేశాలు జారీచేసినట్టు జూలై 2వ తేదీ రాత్రి బాగా పొద్దుపోయాక జమ్మూ జిల్లా మెజిస్ట్రేటు ఎం.కె. ద్వివేది చెప్పారు. ప్రచురణకర్తలకు, ముద్రాపకులకు ఈ మేరకు నోటీసులు జారీచేశామన్నారు. ప్రజలు రెచ్చిపోయే విధంగా అనంతనాగ్ మతప్రదేశాల వార్తా కథనాలు ఎందుకు ప్రచురించారో తెలపాలని ఆ నోటీసులలో కోరారు. జమ్మూ కాశ్మీరు వార్తాపత్రికల సంపాదకులు ప్రచురించే అన్ని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వ చర్యను ఖండిస్తూ తీర్మానాలు చేశారు. ప్రభుత్వ చర్యపై స్టేకోసం ఈ సంఘాలు జమ్మూ కాశ్మీరు హైకోర్టు కెక్కాయి. ●

# మద్య నియంత్రణ ఉద్యమానికి పూర్తి మద్దతు

## మీడియా ప్రతినిధుల హామీ

జనసామాన్యం ఆయురారోగ్యాలను క్షీణింపజేస్తూ, వారిని ఆర్థికంగా దివాళాతీయిస్తూ, కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న మద్యాన్ని నియంత్రించడంలో సహకరిస్తామని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తేల్చిచెప్పారు. మద్య నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో 'మద్య నియంత్రణ ఉద్యమం-మీడియా పాత్ర' అంశంపై జూలై 24న హైదరాబాదు నగరంలోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మీడియా ప్రతినిధులు మాట్లాడారు. అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ అంబటి లక్ష్మణరావు సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రజలకు మద్యం దుష్ఫలితాలను తెలియజెప్పడానికి మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని లక్ష్మణరావు పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యం సేవించిన వాహన డ్రయివర్ల వల్లనే జరుగుతున్నాయని ఆయన అన్నారు. మన పాలకులు మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా పరిగణించడాన్ని ఆయన తప్పుపట్టారు. మద్యపానాన్ని ప్రోత్సహిస్తూ మన పాలకులు ప్రజాశ్రేయస్సును విస్మరిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

రాజకీయాలకు అతీతంగా సామాజిక పరివర్తన ఉద్యమంగా మద్య నియంత్రణ ఉద్యమాన్ని నిర్వహించాలని మద్య నియంత్రణ ఉద్యమ కమిటీ రాష్ట్ర కన్వీనరు వి. లక్ష్మణరెడ్డి పిలుపునిచ్చారు. బెల్టుషాపులను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తేవడానికి మీడియా సహకరించాలని ఆయన కోరారు. మద్యం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక వనరులను సమకూర్చుకుంటున్న రాష్ట్రాలలో మన రాష్ట్రం అగ్రస్థానంలో వున్నందుకు ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ సెక్రటరీ జనరల్ కె. శ్రీనివాసరెడ్డి విచారం వ్యక్తంచేశారు. గతంలో సారాకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి స్పందిస్తూ అప్పటి ప్రభుత్వం ప్రస్తుత ముఖ్యమంత్రి రోశయ్య ఆధ్వర్యంలోనే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఆ కమిటీ సిఫార్సుల మేరకే ప్రభుత్వం సారాను నిషేధించిందన్నారు. కానీ యిప్పుడు సీఎం రోశయ్య హయాంలోనే మద్యం వల్ల 28వేల కోట్ల రూపాయల ఆదాయం రాబట్టడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. మద్యనియంత్రణ ఉద్యమానికి మీడియా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని శ్రీనివాసరెడ్డి హామీయిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రభుత్వంమీద వొత్తిడి పెంచితేనే మద్య నియంత్రణ సాధ్యమవుతుందని మారుతీప్రసాద్ (వార్త) అభిప్రాయపడ్డారు. మద్యపానం వల్ల ఆరోగ్యానికి కలిగే హాని గురించి వివరిస్తూ ప్రభుత్వం వైన్‌షాపుల ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని జయప్రసాద్ (లోకల్ టీవీ) సూచించారు. మద్యానికి బానిసలుగా మారినవారి అకృత్యాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కప్పర ప్రసాద్ (టీవీ-5) కోరారు. చీప్ లిక్కర్ అమ్మకాలు విపరీతంగా పెరిగినట్టు దానిని తాగే పేదప్రజల మరణాలు కూడా నానాటికీ పెరుగుతున్నాయని బి. అమర్ (ఆర్కేన్యూస్) ఆందోళన చెందారు. హెచ్. విద్యారణ్య (ఆంధ్రప్రభ), ఎస్. దినకర్ (సాక్షి), ఫ్రీలాన్స్ జర్నలిస్టు నరేంద్ర, మద్య నియంత్రణ ఉద్యమ కమిటీ కన్వీనరు ఎస్, శ్రీనివాసరెడ్డి, ఎంవీ ఫౌండేషన్ కో-ఆర్డినేటరు ప్రకాశ్, అప్సా కో-ఆర్డినేటరు శివరాణి తదితరులు మాట్లాడారు. ●

## న్యూస్ చానెల్ కార్యాలయంపై దాడి

ఉపరాష్ట్రపతి హత్యకు కుట్ర పన్నిన ఉదంతంపై స్టింగ్ ఆపరేషన్‌ను ప్రసారం చేసిన ఢిల్లీలోని టుడే టీవీ న్యూస్‌చానెల్ కార్యాలయంపై జూలై 16న దాదాపు 600 మంది దాడిచేశారు. వారు ఆ కార్యాలయం తలుపుల అద్దాలను, ఫర్నిచర్‌ను ధ్వంసంచేశారు. సంఘ్‌పరివార్‌తో సంబంధం వున్నవారే దాడిచేశారని డిప్యూటీ పోలీసు కమిషనరు (సెంట్రల్) జస్పాల్‌సింగ్ పేర్కొన్నారు. స్టింగ్ ఆపరేషన్ ప్రసారంతో ఆగ్రహోదగ్రులైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తమ చానెల్ కార్యాలయంలోకి జొరబడి విధ్వంసం సృష్టించారని ఆ చానల్ ఎడిటరు చెప్పారు. తమ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండుచేశారు. ఢిల్లీ పోలీసులు ఈ సందర్భంగా పదిమందిని అరెస్టుచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ●

# గంజాయి తరలింపు కేసులో మూడు చానెళ్ల విలేకరులు

గంజాయి తరలిస్తున్న ఎనమండుగురిలో ముగ్గురు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులున్నారు. విశాఖ ఏజెన్సీనుంచి మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న ఎనమండుగురిని జూలై 7వ తేదీ తెల్లవారుజామున ఎక్సయిజు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాడేరునుంచి వస్తున్న ఆటోను ఎన్‌ఫోర్స్‌మెంటు అసిస్టెంటు ఎక్సయిజు సూపర్నెంటు వి. సుధీర్ ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది కాశీపురం బస్‌షెల్టరువద్ద ఆపి సోదాచేశారు. అందులోని ఆరు గోనెసంచులలో 150 కిలోల గంజాయి వుంది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారితోపాటు దాని వెనుక రెండు బైకులపై వస్తున్న ముగ్గురు విలేకరులను ఎక్సయిజు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం పాడేరుకు చెందిన జి. శంకర్రావు (మహా టీవీ), పీడీ చక్రవర్తి (టీవీ 5, ఆంధ్రప్రభ విలేకరి) కోటిబాబు, (ఐ న్యూస్) అరెస్టయిన వారిలో వున్నారు. గంజాయి తరలిస్తున్న ఆటోతోపాటు విలేకరులు ప్రయాణించిన రెండు మోటారు సైకిళ్లను, వారి కెమెరాలను, సెల్‌ఫోన్లను కూడా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ మూడు లక్షల రూపాయలు వుంటుందని అంచనా.

## విలేకరుల బ్లాక్‌మెయిలింగ్-వ్యాపారి మృతి

ముగ్గురు విలేకరుల బ్లాక్‌మెయిలింగును భరించలేని బియ్యం వ్యాపారి తల్లం కృష్ణయ్య (48) గుండె ఆగి చనిపోయిన సంఘటన కర్నూలు జిల్లా అవుకు మండలంలో జరిగింది. అవుకు పట్టణంలో ఆర్యవైశ్యులు ధర్నా నిర్వహించి వ్యాపారిని బ్లాక్‌మెయిల్‌చేసి అతడి మృతికి కారకులయిన విలేకరుల యిళ్లమీద దాడిచేశారు. అవుకు పట్టణ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం ఈ దారుణ సంఘటన వివరాలు యిలా వున్నాయి. బియ్యం వ్యాపారి కృష్ణయ్య జూలై 15న పది క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం అవుకునుంచి వేరేచోటికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన గురించి తెలియగానే ముగ్గురు విలేకరులు శ్రీనివాసరావు, మహేశ్, ఎస్. రామయ్య వ్యాపారి కృష్ణయ్య వద్దకు వెళ్లి తమకు రెండు లక్షల రూపాయలు యివ్వాలంటూ బ్లాక్‌మెయిలింగుకు పాల్పడ్డారు. లేకపోతే అన్ని పత్రికలలో అతడి బ్లాక్‌మార్కెటు ధంధా గురించి వార్తలు వెల్లువెత్తుతాయని బెదిరించారు. అంత డబ్బు యిచ్చుకోలేని వ్యాపారి మానసికంగా మదనపడుతూ యింటి వద్ద స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే బనగానపల్లె ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం కృష్ణయ్యను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స జరుగుతుండగానే జూలై 16వ తేదీ తెల్లవారుజామున కృష్ణయ్య ఆస్పత్రిలోనే చనిపోయాడు.

వ్యాపారి కృష్ణయ్య భౌతిక కాయం వద్ద బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కోవెలకుంట్ల మాజీ ఎమ్మెల్యే చల్లా రామకృష్ణారెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ముగ్గురు విలేకరులు బ్లాక్‌మెయిలింగు చేయడం వల్లనే తన భర్త కృష్ణయ్య గుండె ఆగి మరణించాడని భార్య రాజరాజేశ్వరి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముగ్గురు విలేకరులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

విలేకరుల బ్లాక్‌మెయిలింగుకు బలైన కృష్ణయ్యకు నివాళులు అర్పించిన ఆర్య వైశ్యులు అవుకు పట్టణంలో రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఆతర్వాత వ్యాపారి మృతికి కారకులైన విలేకరుల యిళ్లపై దాడిచేశారు. ఈ దాడి గురించి అందిన ఫిర్యాదుపై కూడా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. ●

# చట్టసభలలో పెరుగుతున్న జర్నలిస్టుల ప్రాతినిధ్యం

చట్టసభలలో జర్నలిస్టుల ప్రాతినిధ్యం క్రమేణా పెరుగుతున్నది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే జర్నలిస్టులు శాసనకర్తలుగా మారుతున్నందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషిస్తున్నారు. ఈమధ్యనే సీనియర్ జర్నలిస్టు సయ్యద్ అమీనుల్‌హసన్ జాఫ్రీ శాసనమండలికి ఎన్నికయ్యారు. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఆయన ఎంఐఎం అభ్యర్థిగా ఎన్నికయ్యారు. గత సాధారణ ఎన్నికలలో కె. కన్నబాబు ప్రజారాజ్యంపార్టీ అభ్యర్థిగా ఎన్నికై శాసనసభలో అడుగుపెట్టారు. 2004లో మెదక్ జిల్లా దొమ్మాటనుంచి సోలిపేట రామలింగారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అదే జిల్లానుంచి ఆర్. సత్యనారాయణ కూడా శాసనమండలికి ఎన్నికయ్యారు. కాలువ శ్రీనివాసులు గతంలో టీడీపీ అభ్యర్థిగా అనంతపురంనుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. దక్కన్ క్రానికల్ అధినేతలు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, వార్త మేనేజింగు డైరెక్టరు గిరీష్ సంఘీ, ఉదయం పత్రిక వ్యవస్థాపకుడు దాసరి నారాయణరావు గతంలో రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఆంధ్రప్రభ అధినేత ముత్తాగోపాలకృష్ణ ఎమ్మెల్యేగా, ఆంధ్రజ్యోతి చైర్మన్ కె.ఎల్.ఎన్. ప్రసాద్ గతంలో రాజ్యసభ సభ్యుడిగా వున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రస్తుత సీడబ్ల్యూసీ సభ్యుడు కంచర్ల కేశవరావు గతంలో రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు.

# డీఎన్ఎఫ్ జర్నలిస్టు అవార్డులకు ఆహ్వానం

ఎనిమిదో డీఎన్ఎఫ్ గ్రామీణ, మహిళా జర్నలిస్టు అవార్డులకోసం ఎంట్రీలు పంపాలని డీఎన్ఎఫ్ గ్రామీణ, మహిళా అవార్డు ఫౌండేషన్‌ల మేనేజింగ్ ట్రస్టీలు వి. హనుమంతరావు, పి. సరళ ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ విలేఖరులు జిల్లా స్థాయికి దిగువన ఉన్న వారై ఉండాలని, వర్కింగ్ జర్నలిస్టు అనే ధృవపత్రాన్ని జతపర్చాలని సూచించారు. వార్త లేదా వ్యాసాలు 2010 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య కాలంలో ప్రచురితమై ఉండాలని, నాలుగింటిని మూడేసి కాపీల వంతున సెప్టెంబర్ 30, 2010 లోగా చేరేలా 'వి.హనుమంతరావు, సి.ఆర్.ఫౌండేషన్, కొండాపూర్, హైదరాబాద్-500 084' చిరునామాకు పంపాలని కోరారు. ●

# కృష్ణారావుకు మోటూరి అవార్డు

సీనియర్ జర్నలిస్టు కృష్ణారావుకు మోటూరి హనుమంతరావు స్మారక అవార్డు లభించింది. 'పెరుగుతున్న ధరలు-ఆహార సమస్య' అంశంపై ఆయన రాసిన వ్యాసానికి ఈ అవార్డు లభించింది. కృష్ణారావు ప్రస్తుతం ఆంధ్రజ్యోతి దినపత్రిక ఢిల్లీ బ్యూరోచీఫ్‌గా పనిచేస్తున్నారు. మోటూరి హనుమంతరావు తొమ్మిదో వర్ధంతి సందర్భంగా కర్నూలులో జరిగిన సభలో మంత్రి మాణిక్యవరప్రసాద్, ప్రధానమంత్రి మాజీ కార్యదర్శి కె.ఆర్. వేణుగోపాల్ ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ●

## కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ కొత్త కార్యవర్గం

కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్బు కొత్త కార్యవర్గాన్ని జూన్ 23న ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా ఎం.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్.కె.దయాసాగర్, పి. సోమయ్య, జి. దయా కర్‌రెడ్డి, పి.జి. క్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె. మల్లేశం, సంయుక్త కార్యదర్శులుగా జి.ప్రభాకర్, ఎన్.శ్రీనివాస్ చౌదరి, ఎం.ఎ.కరీం, ఎన్. రామక్రిష్ణారెడ్డి, ఆర్. శ్రీనివాస్ యాదవ్, కోశాధికారిగా నవీన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వి.కొండల్ రెడ్డి, పి. తిరుపతి, ఎం.మాణిక్య రెడ్డి,టి. శ్రీనివాస్ రెడ్డి, రాజు, నవీన్ కుమార్, ఎల్. సుధాకర్, శివప్రసాద్, ఎస్. కిరణ్, శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ●

## మరణించిన జర్నలిస్టులకు సంతాపం

ఆంధ్రభూమి సీనియర్ జర్నలిస్టు, ఏపీయూడబ్ల్యూజే నెల్లూరు జిల్లాశాఖ మాజీ కార్యవర్గ సభ్యుడు కాంతారావు, కెమెరామన్ ప్రదీప్ మృతికి జిల్లా కార్యవర్గం సంతాపం ప్రకటించింది. ఏపీయూడబ్ల్యూజే నెల్లూరు జిల్లాశాఖ భవన్‌లో ఈ సంతాపసభ జరిగింది. కాంతారావు, ప్రదీప్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. డీపీఆర్వో నారాయణమూర్తి, యూనియన్ అధ్యక్షుడు జయప్రకాశ్, కోశాధికారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు చక్రపాణి, రఘు తదితరులు పాల్గొన్నారు. ●

ఏఎన్‌సీ ప్రతిపాదన

# స్వతంత్ర మీడియా ట్రిబ్యునల్

పత్రికా స్వేచ్ఛ, ప్రభుత్వ జవాబుదారీతనం లక్ష్యాల పకడ్బందీ అమలుకోసం స్వతంత్ర మీడియా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) ప్రతిపాదించింది. దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ ఈ ప్రతిపాదనకు పూర్తిమద్దతు తెలిపింది. మీడియా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి పునాదివంటిదని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ ప్రగాఢ విశ్వాసం. అలాగే మీడియా స్వీయ నియంత్రణ కూడా ఆశించిన స్థాయిలో లేదని పార్టీ అభిప్రాయపడటం వల్ల ఏఎన్‌సీ ప్రతిపాదించిన స్వతంత్ర మీడియా ట్రిబ్యునల్‌కు మద్దతు ప్రకటించింది. మీడియా ప్రభుత్వ సంస్థ కాకపోయినా ప్రజలకు సమాచారం చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ కారణంగా మీడియాపై వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిశీలించి వేగంగా పరిష్కరించడానికి స్వతంత్రసంస్థ అవసరం వుందని కమ్యూనిస్టుపార్టీ ఒక ప్రకటనలో అభిప్రాయపడింది.

ప్రెస్ అంబుడ్స్ (ప్రెస్ కౌన్సిల్ వంటిది) మీడియా నియమించిన సంస్థ. ఆ సంస్థలో మీడియావారే వుంటారు. తమకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలు తీసుకోవడానికే వారు నియమితులయ్యారు. అంబుడ్స్ ద్వారా దాఖలైన ఫిర్యాదు పరిష్కారం కోర్టుద్వారా జరగాలి తప్ప అంబుడ్స్‌ద్వారా జరగకూడదు. అంబుడ్స్ పరిష్కారం అంటే న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందడానికి ఫిర్యాదుదారుకు వుండే హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. ఇది రాజ్యాంగ విరుద్ధం. మీడియా గురించి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రెస్ అంబుడ్స్ సరిపోదని కమ్యూనిస్టుపార్టీ ఆ ప్రకటనలో వివరించింది.

మీడియా తమ హక్కులను ఉల్లంఘిస్తున్నదని భావించే దక్షిణాఫ్రికా ప్రజలకు కోర్టుకు వెళ్లే హక్కువుంది. మెజారిటీ దక్షిణాఫ్రికన్ల శక్తికి మించిన, వ్యయప్రయాసలతో కూడుకున్న అంబుడ్స్ సుదీర్ఘ ప్రక్రియ. తమ హక్కుల ఉల్లంఘన జరిగిందని భావించేవారికి అంబుడ్స్ సరయిన మార్గం కాదని ప్రకటనలో విశ్లేషించారు. •

## తెలుగు జర్నలిస్టులపై మరాఠా పోలీసుల వీరంగం

తెలుగుదేశంపార్టీ బాబ్లీయాత్ర సందర్భంగా మరాఠా పోలీసులు ఆ పార్టీ ప్రజా ప్రతినిధులతోపాటు అక్కడికి వెళ్లిన మీడియా ప్రతినిధుల మీద కూడా విరుచుకుపడ్డారు. తెలుగుదేశంపార్టీ ప్రజా ప్రతినిధులను బంధించిన ధర్మాబాద్ ఐటీఐ గేటుకు ఆవలవున్న జాతీయ మీడియా సిబ్బందిని చితకబాది వారి కెమెరాలు, క్యాసెట్లు లాక్కున్నారు. అక్కడికి యింకాస్త దూరంలో మన రాష్ట్ర సరిహద్దులోనే వున్న తెలుగు పత్రికలు, ఛానెళ్ల విలేకరులపై లాఠీలు ఝుళిపిస్తూ 14 మందిని అరెస్టుచేశారు. వారి కెమెరాలు, పెన్‌డ్రైవ్‌లు లాక్కుని ల్యాప్‌టాప్‌తో వాటిని చెక్ చేశారు. వాటిలో తాము చేసిన లాఠీచార్జి దృశ్యాలు కనిపించగానే ఉక్రోషం పట్టలేని మరాఠా పోలీసులు మరోసారి విలేకరులమీద చేయిచేసుకున్నారు. ఆదిలాబాదు ఎస్పీ ప్రమోద్ మహాజన్ జోక్యంతో అరెస్టుచేసిన జర్నలిస్టులను నాందేడ్ ఎస్పీ విడుదలచేశారు. అయితే మరాఠా పోలీసులు వారినుంచి లాక్కున్న చిప్‌లను, క్యాసెట్లను మాత్రం వాపస్ చేయలేదు. •

## మీడియా ధోరణి మారాలి: స్పీకర్

అసెంబ్లీ సమావేశాలు పద్ధతి ప్రకారం ఫలప్రదంగా సాగకపోవడానికి మీడియా కారణమని శాసనసభ స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజో పయోగ అంశాలపై ప్రతిపక్షాలు చర్చకు ప్రాధాన్యం యివ్వకుండా వాకౌట్ తదితర సంచలనాత్మక పద్ధతులను అనుసరిస్తుం డగా, మీడియా కూడా ఆ అంశాలకే పతాక శీర్షికలలో ప్రాధాన్యం యిస్తున్న దని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఫలితంగా శాసన సభలో ఫలప్రదమైన చర్చకు అవకాశం లేకుండా పోతు న్నదని ఆయన వ్యాఖ్యా నించారు. అసెంబ్లీ సమా వేశాల కవరేజీలో మీడియా తీరు మారాలని జూలై 4వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజక వర్గంలో జరిగిన విలేకరుల సమావేశంలో స్పీకరు సూచించారు. •

### రైల్వే రాయితీ కూపన్ల గడువు పెంపు

జర్నలిస్టుల రైల్వే రాయితీ కూపన్ల డబ్బు తిరిగి చెల్లించే గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించారు. రైల్వే మంత్రిత్వ శాఖ గుర్తింపువున్న జర్నలిస్టులకు రైలు ప్రయాణాలలో 50 శాతం రాయితీ కల్పిస్తూ 2009 అక్టోబర్ 15 నుంచి ఫోటో గుర్తింపు కార్డులు జారీచేస్తున్నది. అంతకుముందు రైల్వే రాయితీలకోసం కూపన్లు జారీ చేసేవారు. గతంలో వినియోగించగా మిగి లిన కూపన్లను 2010 జనవరి 14 వరకే రైల్వే స్వీకరించి వాటికి సమానమైన నగదును తిరిగి చెల్లించింది. అలా మిగిలిపోయిన రాయితీ కూపన్లకు 2010 డిసెంబర్ 31 వరకు నగదు చెల్లించడానికి రైల్వే మంత్రిత్వశాఖ అంగీకరించింది. •

## ప్రెస్ అకాడమీలో జర్నలిజం కోర్సులు

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ జూలై 5వ తేదీన ఫోటో జర్నలిజం, డిజిటల్ టెక్నిక్స్ అంశాలపై రెండు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించింది. ముఖ్యమంత్రి కె. రోశయ్య జన్మదినోత్సవ కానుకగా ఈ కోర్సులను ప్రారంభించామని అకాడమీ చైర్మన్ తిరుమలగిరి సురేందర్ పేర్కొన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ ఈ కోర్సుల నిర్వహణకు అంగీకరించిందని అకాడమీ కార్యదర్శి నాగయ్య కాంబ్లే పేర్కొన్నారు.

### వర్కింగ్ జర్నలిస్టులకు ఎంసీజేలో ఫీజు రాయితీ

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఫీజు రాయితీతో ఎంసీజే చదవడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో జూలై 26న అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం గతంలో వున్న 25 సీట్లను ఈ ఏడాది నుంచి 45కు పెంచుతారు. ఒప్పందం కాలపరిమితి నాలుగేళ్లు. ఎంసీజే జర్నలిస్టులకు ఫీజులో 25 శాతం అకాడమీ భరిస్తుంది. •

## మహిళా వార్తలపై చిన్నచూపు

ప్రింట్ మీడియాలో మహిళలకు సంబంధించిన వార్తలను చిన్నచూపు చూస్తున్నారు. ఒక అంచనా ప్రకారం ఇంటర్వ్యూలు, వార్తాకథనాలు కూడా కలుపుకుని మహిళలకు సంబంధించిన వార్తలు పత్రికలలో 21 శాతం మాత్రమే ప్రచురితమవుతున్నాయి. •



షా ఫైజల్

## ఐఏఎస్ టాపర్‌కు హెచ్‌యూజే అభినందన

నిజాం నవాబు స్టేట్ గురించి పుస్తకాలలో చదివానని, యిప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నానని 2009 ఐఏఎస్ టాపర్ అయిన కాశ్మీర్ యువకుడు షాఫైజల్ పేర్కొన్నారు. హైదరాబాదు నగరం చాలా అందంగా వుందని ఆయన పేర్కొన్నారు. తమకు యిష్టమైన సబ్జెక్టు చదవడానికి తల్లితండ్రులు పిల్లలకు స్వేచ్ఛ నివ్వాలని ఆయన అన్నారు. హైదరాబాద్ జర్నలిస్టు యూనియన్ (హెచ్‌యూజే) బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జూలై 21న ఏర్పాటుచేసిన అభినందన సభలో ఫైజల్ మాట్లాడారు. హెచ్‌యూజే పెద్దఎత్తున ఏర్పాటుచేసిన ఈ అభినందన సభ తనకు ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. హెచ్‌యూజే సభ్యులు ఎం.ఏ. మాజిద్, రియాజ్ అహ్మద్, గౌస్ మొహినుద్దీన్, ఖలీల్ ఖాద్రీ, కోటిరెడ్డి తదితరులు ఐఏఎస్ టాపర్ షాఫైజల్‌ను అభినందించారు. •

## కోర్టు తీర్పులను విమర్శించే హక్కు మీడియాకుంది

కోర్టు తీర్పులను నిష్పక్షపాతంగా విమర్శించే హక్కు మీడియాకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు 'భావప్రకటన స్వేచ్ఛ'లో ఇది భాగమేనని పేర్కొంది. తీర్పులను సహేతుకంగా విమర్శించడం నేరంకాదని, అది హక్కు అని వివరించింది. న్యాయమూర్తులతో సహా ఎవరూ లోపరహితులు కారని, సద్విమర్శలను ప్రోత్సహించాలని తెలిపింది. కేంద్ర మానవవనరుల శాఖమంత్రి కపిల్‌సిబల్, ఆంగ్లదిన పత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఆ పత్రికా విలేకరిపై దాఖలైన కోర్టు ఉల్లంఘన కేసుపై జూలై 8న విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. •

## నకిలీ విలేకరుల బ్లాక్‌మెయిలింగ్

విశాఖలో వున్న శ్రీనరసింహా టౌన్‌షిప్ లిమిటెడ్ ఎండీ కె.రవి ప్రసాద్‌ను 15 లక్షల రూపాయలు యివ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేసిన యిద్దరు నకిలీ విలేకరులను పోలీసులు జూలై 9వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు జూన్ పదో తేదీన పోలీసు స్టేషన్‌లో విలేకరులకు ఈ విషయం చెప్పారు. అనకాపల్లి గవరపాలెం వాసులయిన కాండ్రేగుల హరిరామకృష్ణ, రవికుమార్ లిద్దరూ తేలిగ్గా డబ్బు సంపాదించడానికి విలేకరుల అవతారమెత్తి రవిప్రసాద్‌ను బెదిరించారని సీఐ చెప్పారు. అయితే హైదరాబాదులోని ఒక చానెల్‌లో పనిచేస్తున్న విలేకరి విజిటింగు కార్డులు నిందితుల వద్ద దొరికినట్టు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. •



## ఫొటోగ్రాఫర్ విజయ్ గుండెపోటుతో మృతి

ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ బండారి విజయకుమార్ (38) అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో ఆర్టీసీబస్సులోనే మరణించారు. జూలై 20తేదీ ఉదయం హైదరాబాదు వెళ్లిన విజయ్ రాత్రి ఎనిమిదిన్నర గంటలకు వికారాబాద్‌లో తాండూరు డిపోబస్సు ఎక్కారు. బస్సు తాండూరు డిపోకు రాత్రి తొమ్మిదిన్నర గంటలకు చేరుకుంది. ప్రయాణికులందరూ దిగిపోయినా విజయ్ తన సీట్లోనే వుండిపోయారు. కండక్టరు శారద, డ్రయివరు వెంకయ్య వెళ్లి చూసి అతడు చనిపోయినట్టు గుర్తించారు. ఈ సంగతి తెలియగానే స్థానిక ఫొటోగ్రాఫర్లు వెళ్లి చూసి అతడిని ఫొటోగ్రాఫర్ విజయ్‌గా గుర్తించారు. తాండూరు పట్టణవాసి అయిన విజయకుమార్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ హైదరాబాదు నగరంలోని వివిధ దినపత్రికలతోపాటు ఏపీయూడబ్ల్యూజే ప్రచురించే జర్నలిస్టు మాసపత్రిక ప్రతిస్పందనకు కూడా ఫోటోలు యిచ్చేవారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, ఈ యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ విజయ్‌కుమార్ మృతి పట్ల ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. ●



నెల్లూరులో జర్నలిస్టుల సాంస్కృతిక పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడిన జడ్పీ చైర్మన్ కాకాని గోవర్ధన్‌రెడ్డి.

## సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

జర్నలిస్టులలో దాగివున్న కళా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని నెల్లూరు జిల్లాపరిషత్తు చైర్మన్ కాకాని గోవర్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సిద్ధార్థ ఆర్ట్స్ అకాడమీ, ఏపీయూడబ్ల్యూజే సంయుక్తంగా జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోనూ నటనా చాతుర్యం వుంటుందని, అయితే వేదికమీద ప్రేక్షకులను మెప్పించేవారే అసలుసిసలు కళాకారులని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కళల ద్వారా ఉపాధి కరువైన కళాకారులు నిరాదరణకు గురవుతున్నారన్నారు. బాలల్లో దాగివున్న కళాప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. నిత్యం పని వొత్తిడితో సతమతమయ్యే జర్నలిస్టులకు యిలాంటి పోటీలు ఊరటకలిగిస్తాయని యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జయప్రకాశ్ అన్నారు. జర్నలిస్టులకు సాంస్కృతిక పోటీలు ఏటేటా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. సాంఘిక ఏకపాత్రాభినయంలో బాలభాస్కర్ (ఈనాడు)కు ప్రథమ, మనుబోలు ప్రభాకర్ (ఆంధ్రప్రభ)కు ద్వితీయ బహుమతులు లభించాయి. పౌరాణిక పాత్రల పోటీలో వెంకటసుబ్బయ్య (వార్త) ప్రథమ, శివకోటేశ్వరరావు ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. పాటల పోటీలో మనుబోలు ప్రభాకర్ ప్రథమ, కిషన్‌వర్మ ద్వితీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు మెమొంటోలు, నగదు బహుమతులు అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లాశాఖ కార్యదర్శి ఎం. వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు రామచంద్రమూర్తి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి వినోద్, సీనియర్ జర్నలిస్టులు చలపతి, చక్రపాణితోపాటు రాష్ట్ర హోటళ్ల సమాఖ్య ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ●



హరిశ్చంద్ర పాత్రధారి వెంకటసుబ్బయ్య




విజేతలకు రోలింగ్‌కప్ అందజేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి.

## క్రీడల పోటీలలో నెగ్గిన

# జర్నలిస్టులకు బహుమతులు

ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే క్రీడలను జర్నలిస్టులు సాధన చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానం దరెడ్డి సూచించారు. నెల్లూరు ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ జూలై 19న నిర్వహించిన క్రీడల పోటీ లలో నెగ్గిన జర్నలిస్టులకు ఆయన బహు మతులు అందజేశారు.

సమాచార సేకరణలో అస్తమానం బిజీ గావుండే జర్నలిస్టులు క్రీడాస్ఫూర్తిని చాటుకోవడం ప్రశంసనీయమని నెల్లూరు నగర మేయరు భానుశ్రీ అన్నారు. జర్నలి స్టులకు ఏటేటా ఆటల పోటీలు నిర్వహి స్తున్నామని యూనియన్ అధ్యక్షుడు జయ ప్రకాశ్ చెప్పారు. వైద్య విధాన పరిషత్తు కోఆర్డినేటరు డాక్టర్ ఎల్. చెన్నయ్య, యూనియన్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి వినోద్, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చెస్‌పోటీని ప్రారంభించిన డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు.

ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ప్రింట్ మీడియా సాధించింది. క్రికెట్‌లో ప్రింట్ మీడియా మొదటిస్థానం, ఎలక్ట్రానిక్ మీడియా రెండోస్థానం సాధించాయి. బెస్ట్ బౌలర్‌గా ఎంవీ శేషయ్య, బెస్ట్ బ్యాట్స్ మన్‌గా తేజశ్రీను, మ్యాన్ ఆఫ్ ది టోర్న మెంటుగా ఎస్ఎం బాషా నిలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో జార్జ్, వెంకట్ రమణలు ప్రథమ, వాసుదేవర, ఇమ్మా నియేలు ద్వితీయ స్థానాలు సాధించారు. వందమీటర్ల పరుగుపందెంలో సలీమ్ ప్రథమ, వెంకట్రావు ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. రెండొందల మీటర్ల పరుగుపందెంలో ఎం. వెంకట్రామ్, ఎండీ మున్నా ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. షాట్‌పుట్‌లో ఎం. వెంకట్రావు, ఎస్. నరసింహారావు విజయం సాధించారు.

ఆటలపోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన సత్యనారాయణ, శివ కుమార్, వై. ప్రీతమ్, వై. సుమన్, అశోక్‌రెడ్డి, నజీర్, వంశీధర్, సురేశ్‌బాబును సత్కరించారు. ●

## మీడియా సరిగ్గా పనిచేస్తేనే

# ప్రజాస్వామ్యం విజయవంతం




**నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఏర్పాటుచేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడిన బీజేపీ సీనియర్ నాయకుడు వెంకయ్యనాయుడు.**

ప్రజాస్వామ్యంలో మీడియా, న్యాయవ్యవస్థ సరిగా పనిచేస్తేనే వ్యవస్థలో లోపాలుండవని బీజేపీ సీనియర్ నాయకుడు ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్బులో ఏపీయూడబ్ల్యూజే ఏర్పాటుచేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో అశాంతి ప్రబలడానికి, అవినీతి పెచ్రేగడానికి, రాజకీయ వ్యవస్థ గాడితప్పడానికి అనేక కారణాలున్నాయని ఆయన అన్నారు. ఈ దుర్నీతులను అరికట్టగల శక్తి పత్రికలకు, న్యాయవ్యవస్థకు వుందన్నారు. రాజకీయ వ్యవస్థ తప్పుదారిపడితే ప్రజలు ఐదేళ్ల తర్వాత వ్యతిరేక తీర్పుయిస్తారని, యిందుకు పత్రికలు దోహదం చేయాలన్నారు. సంచలనాలకు, షాడో న్యూస్‌కు అలవాటుపడిన కొన్ని పత్రికలు విలువలను దిగజారుస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వార్తలకు, వ్యాఖ్యలకు మధ్య తేడా వుండాలని ఆయన సూచించారు. పెయిడ్‌న్యూస్‌ను అరికట్టాలన్నారు.

జిల్లా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జయప్రకాశ్, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు రామచంద్రమూర్తి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి వినోద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. •

# మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జర్నలిస్టు కుటుంబాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఏపీయూడబ్ల్యూజే జిల్లాశాఖ తరఫున ప్రతిభా పురస్కారాలను నెల్లూరు జిల్లాపరిషత్తు చైర్మన్ కాకాని గోవర్థన్‌రెడ్డి అందజేశారు. మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడానికి జిల్లా జర్నలిస్టుల అసోసియేషను చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఎవరినీ చందాలు అడగకుండా విలేకరుల సహకారంతో పదో తరగతి మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్బులో ఈ కార్యక్రమం జరిగింది. పదోతరగతి విద్యార్థిని జాస్మిన్ 568 మార్కులు, మరో ముగ్గురు వరుసగా 556, 532, 502 మార్కులు తెచ్చుకున్నారని ఏపీయూడబ్ల్యూజే జిల్లాశాఖ అధ్యక్షుడు జయప్రకాశ్ చెప్పారు. సీనియర్ జర్నలిస్టు చక్రపాణి, యూనియను కోశాధికారి వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు. •



**556 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన శివప్రియకు మెమొంటో అందజేసిన నెల్లూరు జడ్పీ చైర్మన్ కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రతిభా పురస్కారాలు అందుకున్న యితర విద్యార్థులు.**

### విమర్శించిన పత్రికా డైరెక్టర్‌కు స్థానచలనం - పాత్రికేయులపై వేటు

# మీడియాపై ఉక్కుపాదం

## సర్కోజీ చర్యలు అత్యంత ప్రమాదకరం : సోషలిస్టు నాయకులు

ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలాస్ సర్కోజీ తన పరిధిని దాటి అవసరంలేని విషయాల్లో తలదూర్చుతున్నారా అంటే అది నిజమేననిపిస్తోంది. అక్కడ జరుగుతున్న కొన్ని విషయాలు దీనిని బలపరుస్తున్నాయి. సర్కోజీకి సొంతంగా ఏ విధమైన మీడియా సంస్థలు లేవు. అయితే, మీడియా అధిపతులతో సర్కోజీకి మంచి మిత్రుత్వం ఉంది. వారంతా ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆయన్ని అధ్యక్షపదవిలో కూర్చోబెట్టేందుకు సాయపడ్డవారే. అధ్యక్ష స్థానంలో వుండి కూడా మీడియాలో వచ్చే ప్రతి విషయంలోనూ ఆయన కలగజేసుకోవడం గమనార్హం.

'లె మండే' పత్రిక అమ్మకం వ్యవహారంలో సర్కోజీ వ్యవహరించిన శైలిపై ప్రస్తుతం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. లెమండే స్థాయిలో అధ్యక్షుడిని విమర్శించే పత్రిక మరొకటి లేదనేదికూడా అందరికీ తెలిసిన విషయమే. ఫ్రాన్స్ ప్రభుత్వ అవినీతిని లెమండే పత్రిక బయటపెట్టి విజయం సాధించిన విషయం మరువకూడదు. అదే సమయంలో ఆ పనిని సర్కోజీ మిత్రుల పత్రికలు చేయలేవనే విషయాన్ని గుర్తించాలి. లెమండే అమ్మకంలో సర్కోజీ పాత్ర బహిరంగ రహస్యమన్నది ప్రతి ఒక్కరి వాదనగా ఉంది. సర్కోజీ సర్వాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారంటూ దేశ ప్రధాన దినపత్రికలో విమర్శించినందుకు (ఈ పత్రిక సర్కోజీ సన్నిహితునిది) ఆ పత్రిక డైరెక్టరుకు



నికోలాస్ సర్కోజీ

స్థానచలనం కలిగించిన విషయం అత్యంత దిగ్భ్రాంతిని కలిగించే అంశం. ఇదొక్కటే కాదు, రేడియోలో సర్కోజీపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన ఇద్దరు సెటైరిస్టుల ఉద్యోగాలు ఊడిపోయాయి. తనపై వ్యంగ్యంగా రేడియోలో వచ్చిన అంశంపై ప్రస్తావిస్తూ 'అవమానం, హేయం, నీచం' అని సర్కోజీ వ్యాఖ్యానించినట్లు వార్తలొచ్చాయి.

ప్రస్తుతం ఫ్రాన్స్ మీడియా మంత్రిత్వశాఖ సర్కోజీ చేతిలోనే ఉంది. దేశ ప్రజలంతా మీడియాకు నూతన మంత్రికోసం ఎదురు చూస్తున్నారు. మార్చిన నూతన చట్టం ప్రకారం తాను కోరుకున్న వ్యక్తికి మీడియాపై అధికారాన్ని కట్టబెట్టే వెసులుబాటు సర్కోజీకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో మూడు ప్రధాన టీవీ ఛానల్స్ ఉన్నాయి. వాటిలో "ఫ్రాన్స్ ప్రెస్' ప్రపంచంలో మూడో అతిపెద్ద వార్తా సంస్థ. ఇంత పెద్ద మీడియా సంస్థ స్వేచ్ఛపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తోంది. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే దేశంలోని మీడియా రంగంపై రాజకీయ ప్రాబల్యం పెరిగిపోయిందా అని అనిపించక తప్పదు. దీంతో ఫ్రెంచ్ ఫోర్త్ ఎస్టేట్, బెర్లుస్కోనైజేషన్‌గా మారనుందా అని అనిపిస్తోంది. బెర్లుస్కోనీ ఒక రాజకీయ ప్రముఖుడు. ఇటలీలో మూడు ప్రధాన టెలివిజన్ నెట్‌వర్కులకు అధినేత. ఇటలీ జనాభాలో సగానికిపైగా ఈయన ఛానల్స్‌నే వీక్షిస్తారనడంలో ఆశ్చర్యంలేదు. ఆయన ఆ దేశానికి ప్రధాని కూడా. ఆయన దాదాపు 90 శాతం మీడియాపై అజమాయిషీ చెలాయిస్తున్నారు.

అదే సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు సర్కోజీకి సొంతంగా మీడియా లేదు. అతిదగ్గరైన మీడియా అధిపతులున్నారు. తన అవసరాల కొరకు మీడియాను ఉపయోగించుకోవడానికి సర్కోజీ ఏనాడూ వెనుకాడలేదు. ఇటలీలో బెర్లుస్కోనీ మాదిరిగా సర్కోజీ వ్యవహరిస్తున్నారు. గత ఏప్రిల్ మాసంలో ఫ్రాన్స్ ప్రధాన పత్రిక తన ప్రధాన కథనంలో 'నికోలాస్ సర్కోజీ ఫ్రాన్స్ టెలివిజన్స్ అధ్యక్షుడు అని పేర్కొంది. దీనిని బట్టి మీడియాపై సర్కోజీ వ్యవహారశైలి అర్థమవుతుంది. దేశంలో ప్రధాన టెలివిజన్ కూడా సర్కోజీ వ్యవహారశైలిని, మీడియాలో ఆయన విపరీత చొరవని గత కొంత కాలంగా దుయ్యబడుతోంది.

ఎన్నికలు ముగిసిన అనంతరం సర్కోజీ మీడియాపై తన విశ్వరూపం చూపి

స్తున్నారు. పాత్రికేయులను తప్పుబడు తున్నారు. అనేక అంశాలకు సంబంధించి పాత్రికేయులు కోర్టు గడపలు తొక్కుతున్నారు. జైళ్లలోకి నెట్టబడుతున్నారు. దీనంతటికీ ప్రధానంగా 2007 ఎన్నికలకు ముందు, అంటే 2005లో సర్కోజీ అంతర్గత మంత్రిగా ఉన్న సమయంలో ఆయన భార్య సెసిలియా తన ప్రేమికునితో ఉన్నట్లు 'పారిస్ మాచ్' (ఇది కూడా సర్కోజీ సన్నిహితుని పత్రికే) అనే పత్రికలో ఫొటోతో సహా కథనం వచ్చింది. దీంతో సర్కోజీ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. వెనువెంటనే ఆ కథనాన్ని ప్రచురించిన పత్రిక ఎడిటర్‌ను విధులనుంచి బలవంతంగా తొలగించారు. అనంతరం 2007 ఎన్నికల సమయంలో తనకు మీడియా పట్ల ఎనలేని గౌరవముందని ప్రకటించారు. పాత్రికేయులపై సర్కోజీ అన్నిమార్లూ ప్రత్యక్షంగానే దాడి చేయడం లేదు. తన మిత్రులైన పత్రికల యజమానులతో పాత్రికేయులపై పరోక్షంగా దాడికిదిగారు.

సర్కోజీకి అత్యంత సన్నిహితులైన 'పారిస్ మాచ్' అధినేత లగర్‌డెరే, సర్కోజీకి కుడిభుజంగా వ్యవహరిస్తారు. డెరేకు పారిస్ మాచ్‌తోపాటు 'ఎల్లే' 'జర్నల్ డు డిమంచ్', 'టెలి 7 అవర్స్', ఇలా అనేక వార్తా సంస్థలు, రేడియో కేంద్రాలు వున్నాయి. దీనికి తోడు ఆయనకు దేశ వ్యాప్తంగా కేబుల్ టీవీ కూడా ఉంది. అదే విధంగా మరో ఛానెల్ దిగ్గజం మార్టిన్ బోగ్యూస్ కూడా సర్కోజీకి అత్యంత సన్నిహితుడు. ఈయనకు కూడా దేశవ్యాప్తంగా అనేక టీవీ ఛానల్స్ ఉన్నాయి. యూరోస్పోర్ట్ సహా అనేక కేబుల్ టీవీలు కూడా ఆయన నడుపుతున్నారు. ఈ ఇద్దరు స్నేహితులూ అధ్యక్షుడు సర్కోజీతో నిత్యం మాట్లాడుతూ ఉంటారనేది దేశ ప్రజలకు తెలిసిన విషయమే. అదేవిధంగా బెర్నార్డ్ అర్నాల్ట్ కూడా సర్కోజీకి అత్యంత సన్నిహితుడు. అర్నాల్ట్‌కు దేశంలోని మీడియాలో దాదాపు 25 శాతం భాగస్వామ్యం ఉంది.

ఇలా మీడియాలో సర్కోజీకి అత్యంత సన్నిహితులున్నారు. దీంతో సర్కోజీని విమర్శించేవారిపై వేటు వేయడం అధ్యక్షునికి అత్యంత తేలికైన విషయంగా మారింది. ఒక రకంగా చెప్పాలంటే సర్కోజీ మీడియాను తన సొంతానికి ఉపయోగించు కుంటున్నారనే చెప్పవచ్చు. స్థానిక సోషలిస్టు ఎంపీ అర్నాడ్ మోంట్‌బెర్గ్ స్పందిస్తూ దేశంలోని ప్రధాన మీడియా అధ్యక్షునికి భజన చేస్తోందని విమర్శించారు. ఇది అత్యంత ప్రమాదకరమైన అంశంగా ఆయన అభివర్ణించారు. సర్కోజీకి అనుకూల అంశాలే వార్తల్లో చోటుచేసుకుంటాయని ఆయన విమర్శించారు.

***(ప్రజాశక్తి సౌజన్యంతో)***

## ఆన్‌లైన్‌లో అల్‌కాయిదా పత్రిక

**హింసాత్మక** చర్యలతో ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఉగ్రవాదసంస్థ అల్‌కాయిదా తన భావజాల ప్రచారం, నియామకాలకోసం ఆన్‌లైన్‌లో ఆంగ్లపత్రికను వెలువరించడానికి సన్నాహాలు చేస్తున్నది. ఈ పత్రిక పేరు 'ఇన్‌స్పైర్'. ఈ ఆన్‌లైన్ పత్రిక ప్రారంభమైతే అమెరికా, యూరప్‌లలో అల్‌కాయిదా నియామకాలను చేపట్టే అవకాశం వుందని వినికిడి. ఈపాటికప్పుడే ఈ పత్రిక ప్రచారాన్ని అల్‌కాయిదా చేపట్టింది. ఇస్లామిక్ దేశానికి ప్రత్యేక బహుమతి పేరుతో యానిమేషన్‌తో తయారుచేసిన గ్రాఫిక్స్ ఆ సైట్‌లో వున్నాయి. అల్‌కాయిదా ఎమన్‌శాఖ ఈ వెబ్‌సైటును నిర్వహిస్తుండవచ్చునని ఉగ్రవాద వ్యతిరేక అధికారులు భావిస్తున్నారు. అమెరికా వైమానిక దాడులలో బలహీనపడుతున్న అల్‌కాయిదాను అమెరికాలోనూ విస్తరించాలనే భావన ఈ వెబ్‌సైట్ లక్ష్యం కావచ్చునని చెప్పుకుంటున్నారు. అమెరికాలో యిప్పటికే ఉగ్రవాదులు పుట్టుకొస్తున్నారని సీఐఏ మాజీ అధిపతి రీడెల్ పేర్కొనడం గమనార్హం. ●

## కోటిన్నర కాపీలు అమ్ముడుపోయే వార్తా పత్రిక

**కోటికి** పైగా కాపీలు అమ్ము డుపోయే వార్తాపత్రిక గురించి మీరు విన్నారా? జపాన్ రాజధాని టోక్యోనుంచి వెలువడే 'యోమి యురిషింబక్' దిన పత్రిక మార్నింగ్ ఎడిషను కాపీలు రోజుకు కోటికిపైగా అమ్ముడవుతాయి. ఈ పత్రిక ఈవినింగ్ ఎడిషను కాపీల అమ్మకాలు సుమారుగా అర కోటి వుం టాయి. అంటే, ఈ వార్తాపత్రిక రోజు వారీ అమ్మకాలు కోటిన్నర కాపీల న్నమాట.

## దినపత్రికల పాఠకులు జపాన్‌లో జాస్తి

దినపత్రికలు చదివే పాఠకులు జపాన్‌లో ఎక్కువగా వున్నారు. ఆ దేశం లో ప్రతి పది మంది పాఠకులలో తొమ్మండుగురు దినపత్రికలు చదువు తున్నారు. ప్రసార, ప్రచార మాధ్యమాలు టెలివిజన్, రేడియో, మేగజైన్లు, దిన పత్రికలు, ఇంటర్నెట్ రంగాలపై యిటీవల జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. జపాన్ వార్తా పత్రి కల ప్రచురణకర్తలు, సంపాదకుల సంఘం నిర్వహించిన ఈ అధ్యయ నంలో 91.3 శాతం పాఠకులు దినపత్రికల వైపే మొగ్గుచూపినట్టు వెల్లడైంది.

# 'PAID NEWS' INTERFERES WITH CONCEPT OF FREE, FAIR AND OBJECTIVE PRESS: PRATIBHA PATIL

*- Jiby Kattakayam*

**RAMNATH GOENKA AWARD FOR JOURNALIST OF THE YEAR GOES TO SIDDHARTH VARADARAJAN OF THE HINDU**



*Siddharth Varadarajan of TheHindu receives the Ramnath Goenka Journalist of the Year Award in the Print Category from President Pratibha Patil in New Delhi on Thursday. Eminent agricultural scientist M.S. Swaminathan and Indian Express Editor-in-Chief Shekhar Gupta (right) look on. — Photos: S. Subramanium*

President Pratibha Patil on Thursday said the recent phenomenon of 'paid news' could distort news and this interfered with the concept of a free, fair and objective press.

Speaking after presenting the 4 {+t} {+h} Ramnath Goenka Excellence in Journalism Awards at the Taj Palace hotel here, the President delved into the history and relevance of the Indian media and the challenges it faced in today's constantly changing world.

"With a long tradition of press freedom, its role in the freedom struggle and the high professional standards that have been set, contemporary journalism can draw strength from this legacy," she said.

Ms. Patil termed journalistic accounts "important chronicles of our time" and pointed out that this reinforced the duty of the media to report events objectively and correctly, without resorting to sensationalism.

She noted that media today operated in a "relentless 24-hour news cycle." A situation existed today where newspaper headlines in the morning were no longer new. "Today issues are trivialised and trivial issues become headlines. In a fast-paced world, in-depth research suffers. Audiences and readers still demand and welcome well-researched stories."

Award jury member and Rajya Sabha member M.S. Swaminathan reminded the winners that they were "not only custodians of the integrity of the media, but also custodians of our personal freedoms."

The awards were given to 29 categories, comprising political reporting, business, sports, environmental and entertainment journalism, investigative journalism and on-the-spot reporting.

Siddharth Varadarajan, chief of the Delhi Bureau of TheHindu, was selected for the Journalist of the Year award in the Print Category for his extensive reportage on the India-U.S. nuclear deal, the placing of India's civil nuclear reactors under the International Atomic Energy Agency safeguards and the exemption granted to India by the Nuclear Suppliers Group.

In his speech after receiving the award, Mr. Varadarajan said he had to dedicate considerable time and effort for the stories, and was thankful for having a platform like TheHindu, which helped him to write about the issue in all its complexities.

Arnab Goswami, Editor-in-Chief of Times Now, was selected for Journalist of the Year in the Broadcast Category. "Some will call our journalism jingoistic, but I would call it blunt," he said in his acceptance speech.

Harish Damodaran of The Hindu Business Line won the award for the Best Non-Fiction Book in English for his work, "India's New Capitalists."

Indian Express Editor-in-Chief Shekhar Gupta announced a new award category for "Journalism of Courage." It was given posthumously to Indian Express correspondent Vijay Pratap Singh, who died on Tuesday night of the injuries he sustained in a bomb blast in Allahabad on July 12.

A panel discussion on "Good News is Paid News, Credibility is for Sale" followed the awards ceremony.

*- The Hindu 27th July 2010*